ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 28.0
కనిష్ఠం : 25.0



వేలేరుపాడు-రుద్రమ్మకోట కాజ్‌వేపై వరదనీరు



మార్పుకే.. మచ్చ!

అధికారుల తీరుపై ఎమ్మెల్యేల గుస్సా

- 'అటవీశాఖ సమస్యలు అన్నీఇన్నీ కావు. ఏమైనా చెబుదామన్నా వాళ్ళేమన్నా కంటికి కనపడితేనే కదా. కీలక సమావేశాలు జరిగినా రానేరారు. ఇక చెప్పుకోవడానికి, పరిష్కారా నికి తావేది. ఏమో ఎవరికి చెప్పాలో తెలియడం లేదు' ఇది ఒక ప్రజాప్రతినిధి ఆక్రోశం.
- 'రెవెన్యూ సమస్యలు కోకొల్లలు. ఒకరికి చెబుదామంటే ఇంకొకరికి చెప్ప మంటారు. తీరా చెబితే పరిష్కారం కాదు. పదేపదే పనేమైందని ప్రశ్నిస్తే మాత్రం ఇదిగో అదిగో అంటూ నాన్చేస్తారు. నా ఒక్కరి సమస్య కాదిది. ప్రతీ ఒక్కరి సమస్య. అధికార పక్షంలో ఉన్నాం కాబట్టి గట్టిగా నోరు తెరవలేకపోతున్నాం' ఇది మరో ప్రజాప్రతినిధి ఆవేదన.
- 'ఇదేంటి మొత్తం ప్రచారమంతా ఆవైపే తిరుగుతా ఉంది. కనీసం మేముకూడా ఉన్నాం కదా. ప్రజాప్రతినిధిగా మమ్మల్ని చూడాలి కదా. ఏంటీ వన్‌సైడ్.. ఏంటో ఎంత చెప్పినా ఇంతే.. స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రచార శకటా లపై అంతా అధికారులదే ఆర్భాటం'... ఒక ముఖ్య ప్రజాప్రతినిధి ఆగ్రహమిది.
- సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగానికి ఒక పేదింటి పిల్లోడు ఏదో చెప్పుకుందామని వచ్చాడు. ఆ సమావేశానికి వచ్చిన మంత్రి చూసి సమస్య పరిష్క రించాల్సిందిగా అధి కారులను ఆదేశించారు. ఆ పిల్లాడి సమస్య పరిష్కారమైతే అయ్యిందికాని జిల్లా ముఖ్య అధికారి పేరిటే అంతా వైరల్ అయ్యింది. ఆహా.. ఓహో అంటూ సమాచార శాఖ గుప్పించింది. ఇంకేముంది సదరు మంత్రి పేషీ మండి పడింది. చేసింది మంత్రి అయితే.. రివర్స్‌లో ఇంకొకరికి ఎలా ఆపాదిస్తారంటూ సర్రుమంది.

- చెప్పింది చేయడం లేదని ఆక్రోశం
- మంత్రుల మాట బేఖాతరంటూ ఆగ్రహం
- క్రమేపీ పట్టు తప్పుతున్న యంత్రాంగం
- ఇన్‌చార్జి మంత్రి దృష్టికి వ్యవహారం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

జిల్లాలో అధికార యంత్రాంగం, ప్రజాప్రతి నిధుల మధ్య అప్పుడప్పుడు అంతరం చోటు చేసుకుంటూనే ఉంది. తెలిసో తెలియకో కాదు. కావాలనే ఏకపక్షంగా వ్యవహరించడం ఇక్కడ రివాజుగా మారింది. ప్రత్యేకించి కొన్ని సందర్భా ల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్తే.. ప్రయోజనం శూన్యం. కదలం మెదలం అన్నట్టుగా కొందరి అధికారుల తీరుగా మారింది. ఇదే పాలనా యంత్రాంగం మొత్తాన్ని ప్రభావితం చేస్తుంది. చాన్నాళ్ళుగా కొన్ని విభాగాధిపతులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరించడం, కలెక్టర్ చెబితేనే తాము పనిచేస్తామన్నట్టుగా వ్యవహరించడం, లేదంటే చూద్దాం చేద్దామంటూ కాలం గడి పేయడం పలుమార్లు ప్రత్యక్షంగా కనిపిస్తోంది. ప్రత్యేకించి సమావేశాలకు అది జిల్లా అయినా.. మండలమైనా ఒక్కటే. ప్రజాప్రతినిధులతో సహా అన్ని శాఖల అధికారులు సమావేశాలకు హాజరుకావాల్సింది పోయి.. తమకేమీ పట్ట నట్టుగా సమావేశాలను అధికారులు మెల్ల కన్నుతో చూస్తున్నారు. అధికారులు సమా వేశాలకు రావడం లేదు.. ఎందుకంటూ మండ ల పరిషత్, నగరపాలక సంస్థ సమావేశాల్లో పదేపదే వినిపిస్తూనే ఉంది. కాని ఇలా సమా వేశాలకు ఎగనామం పెడుతున్న కొందరి పైనైనా చర్యలు తీసుకుంటే మళ్లీ ఇలాంటి పునరావృతం కాకుండా ఉండేవి. జిల్లా స్థాయిలో మాకెందుకులే అన్నట్టుగా వదిలేయడంతోనే ముదిరి పాకాన పడింది.

ఎవరైతే మాకేంటి..?

జిల్లా స్థాయిలో చాలా శాఖలు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాయి. స్వయంగా ఎమ్మెల్యేలే ఈ విషయాన్ని తెగేసి చెబుతున్నారు. జిల్లాల విభ జన జరిగిన తర్వాత ఈ తరహా వాతావరణం మరింత పెరిగింది. అటవీ, రెవెన్యూ, వ్యవ సాయం, పంచాయతీరాజ్‌తో సహా అనేక విభా గాల్లో అధికారుల తీరుపై విమర్శలు వస్తూనే ఉన్నాయి. 'రెవెన్యూతో అనేక ఇబ్బందులు ఉన్నా యి. ప్రతీసారి చెబుతూనే ఉన్నాం. వాళ్ళకేమో పట్టడంలేదు. ఇలాగైతే ఎలా. సీరియస్‌గా తీసు కోవడం తెలియడంలేదు. అటవీశాఖ సంగతి చెప్పనక్కర్లేదు. పట్టాలిచ్చారు కదా అని నా నియోజకవర్గంలో రైతులు సంతోషపడ్డారు. తీరా ఆ భూముల్లో సాగుకు అనువుగా బోరు వేద్దామంటే.. అటవీశాఖ అడ్డంకి. అడుగుదా మంటే ఒక్కరూ అందుబాటులో ఉండరు' జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఒక ప్రజాప్రతినిధి ఫిర్యాదిది. కేవలం మౌలిక వస తులకు అనువుగా రోడ్లు, తాగునీరు కల్పిద్దామ నుకున్నా అబ్బబ్బే.. అటవీశాఖ అడ్డంగా అడ్డు తగులుతోంది. లంకల్లో జనం బతకాలికదా. ఇప్పుడు కొల్లేరుకు వరదొస్తే పెద ఎడ్లగాడివద్ద గుర్రపుడెక్క అడ్డు తగులుతోంది. ఇప్పుడేం చేయాలి.. కైకలూరు ఎమ్మెల్యే నేరుగానే నిట్టూర్చే పరిస్థితి. వరద నివారణకు వీలుగా ఎక్కడికక్కడ స్థానిక యంత్రాంగం రంగంలోకి దిగాల్సి ఉండగా అదేదీ కనిపించకపోవడంతో సదరు ఎమ్మెల్యే సమావేశంలో ప్రస్తావించాల్సి వచ్చింది. జిల్లా స్థాయిలో వర్షాలు, వరదలపై సమీక్షలు జరుగుతున్నప్పుడు ఆయా శాఖలకు నిర్ణయాత్మకంగా కొన్ని సూచనలు జారీ చేసి వాటిని అమలుపరిచే బాధ్యత సంబంధిత శాఖలకు ఇచ్చినా కార్యాచరణలో వెనుకడుగు వేయడం జిల్లాలో నిత్యకృత్యంగా మారింది. చిన్న చిన్న సమస్యలపైనా ఫిర్యాదులపరంపర కొనసాగుతూనే వచ్చింది. సాధారణంగా జిల్లా, మండల స్థాయిలో (మిగతా 8వ పేజీలో)

దోబూచులాట!

- శబరి ఉధృతి.. రహదారులపై వరదనీరు

కుక్కునూరు/వేలేరుపాడు/పోలవరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎగు వన కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరి వరద ముంచు కొస్తుంది.ఇదే సమయంలో మంగళవారం ఉదయం ఆరు గంటలకు భద్రాచలం వద్ద 37.30 అడుగుల నీటిమట్టం నమోదు కాగా అనంతరం నెమ్మదిగా తగు తూ మధ్యాహ్నం 3గంటలకు 36అడుగులకు తగ్గింది. అనంతరం మళ్లీ నెమ్మదిగా పెరుగుతూ సాయంత్రానికి 36.30 అడుగులకు చేరుకుంది. నీటిమట్టం 40 అడుగులు దాటితే పంటలు నీట మునిగే అవకాశం ఉంద ని రైతాంగం ఆందోళన చెందుతున్నారు. గోదావరి వరదకు ముందుగా ముంపునకు గురయ్యే గొమ్ముగూడెం గ్రామస్థులు ఇప్పటికే రెండునెలలుగా దాచారం పునరావాస కాలనీలో ఉంటున్నారు. తహసీల్దార్ రమేశ్‌బాబు లచ్చిగూడెం వెళ్లి అక్కడ ప్రజలను అప్రమత్తం చేసి పునరావాస కాలనీకి తరలిరావాలని సూచించారు. ఇప్పటికే గుండేటివాగు లోలెవల్ కాజ్‌వే, మాలవాగు లోలెవెల్ కల్వర్టు, నీటి మునిగాయి. ఆయా గ్రామాలకు వెళ్లడానికి చుట్టూ తిరిగి మరోదారిలో వెళ్తున్నారు.



కుక్కునూరు గోదావరి తీరంలో ముంచుకొస్తున్న వరద

శబరి నదికి వరదపోటు


ఛత్తీస్‌గడ్, ఒడిశా రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు శబరి నదికి వరద పోటెత్తుతోంది. దీంతో శబరి గోదావరిలో కలిసే కూనవరం వద్ద శబరి నీటిమట్టం భారీగా పెరుగుతోంది. ఈ ప్రభావంతో ఇవతల ఉన్న వేలేరుపాడు మండలంలోకి శబరి, గోదావరి నదుల వరదనీరు వాగులు, కాల్వల ద్వారా ప్రవేశించి రహదారుల పైకి చేరుతోంది. మంగళవారం మధ్యాహ్నానికి వేలేరుపాడు-రుద్రమ్మకోట లోలెవల్ కాజ్‌వే నీటమునగ డంతో రుద్రమ్మకోట, లచ్చిగూడెం, మద్దిగట్ల గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. ఎద్దువాగు వంతెనకు వరద పెరగడంతో సుమారు 15 గ్రామాల ప్రజలు నాటుపడవ ద్వారానే ప్రయాణిస్తున్నారు. గోదావరి ఉప నదులైన కిన్నెరసాని, తాలిపేరు ప్రాజెక్టుల నుంచి నీటిని దిగువకు వదిలి వేయడంతో భద్రాచలం దిగువన ముంపు మండలాల్లో గోదావరి వరద భయపెడుతోంది.

విలీన మండలాలపై బ్యాక్‌వాటర్ ప్రభావం

పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం మంగళవారం నాటికి అనూహ్య రీతిలో పెరగడంతో ఎగువ కాఫర్ డ్యాం బ్యాక్ వాటర్ ప్రభావం కుక్కు నూరు, వేలేరుపాడు విలీన మండలాలపై ఎక్కువ ప్రభా వం చూపు తోంది. పోలవరం కడెమ్మ స్లూయిజ్ గేట్లు వరద నీటిలో మునిగి పోవడం తో ఏటిగట్టుకి కుడివైపున ఉన్న కొండవాగుల జలాలు గోదావరిలోకి వెళ్లే అవకాశం లేక పంటపొలాలు నీటిమునిగే అవకాశాలు ఉండడంతో ఇప్ప టికే నాట్లు వేసుకున్న రైతులు ఆందోళన చెందుతున్నారు.

స్వల్పంగా పెరిగిన కొల్లేరు వరద

కైకలూరు/మండవల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కొల్లేరుకు వరద ఉధృతి మంగళవారం స్వల్పంగా పెరిగింది. ఎగువ నుంచి వరద నీరు పెద్దఎత్తున చేరడంతో లంకగ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. ఇప్పటికే లంకగ్రామాల చుట్టూ భారీగా వరదనీరు చుట్టుముట్టింది. భారీవర్షం కురిస్తే ఈ నీరు మరింత పెరిగి గ్రామాల్లోకి చేరే పరిస్థితులు నెలకొంటాయి. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తన సొంతసొమ్ముతో ఎక్స్‌కవేటర్ ఏర్పాటు చేసి పెద్దఎడ్లగాడి వంతెన వద్ద దట్టంగా అలుముకున్న గుర్రపుడెక్క తొలగింపు చర్యలను చేపడుతున్నారు. గుర్రపుడెక్క దట్టంగా పేరుకుపోచి పెనుమాకలంక రహదారిపైకి చేరుకుంది. గుర్రపుడెక్కలో రోడ్డు ఎక్కడుందో కనిపించని పరిస్థితి ఉంది. మండవల్లి మండలం పెద్దఎడ్లగాడి వద్ద ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ వరద ఉధృతిని పరిశీలించి సహాయచర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొల్లేరు గ్రామాల్లో ప్రస్తుతం రాకపోకలకు మాత్రమే ఇబ్బంది ఉందని దీనికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు. పడవల పై ప్రయాణించేవారు ఖచ్చితంగా రెవెన్యూ, పోలీసుల పర్యవేక్షణలో ఉండాలని కోరారు. వరద సహాయక చర్యలు పూర్తిస్థాయిలో చేపడతామ న్నారు. కైకలూరు మండలం ఆటపాక, గోనెపాడు గ్రామాల్లో ఉధృతంగా కొల్లేరు ప్రవహిస్తోంది. సర్కారుకాలువ నీటి ప్రవాహం పెరిగింది.



ఆటపాకలో ఉధృతంగా ప్రవహిస్తున్న కొల్లేరు



ఐపీపీబీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

పోలవరం ఆర్‌అండ్‌ఆర్ పనులు వేగవంతం : కలెక్టర్

ఏలూరు,ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం అమలు చేస్తున్న ఆర్‌అండ్‌ఆర్ పనుల కు సంబంధించిన భూసేకరణ వేగవం తం చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి పోలవరం ప్రాజెక్టు భూసేకరణతో పాటు పలు అంశాలపై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మంగళవారం ఆమె సమీక్షించారు. తాడిపూడి ఎత్తిపోతల పథకానికి భూసేక రణ వేగంగా చేపట్టాలన్నారు. జేసీ ధాత్రిరెడ్డి, నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న, డీఆర్వో విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఐపీపీబీ ఖాతాలతో లబ్ధి..

ఏలూరు అర్బన్: ఉపాధిహామీ పథకం లబ్ధిదారులు తమ సమీపంలోని పోస్టాఫీసులో ఐపీపీబీ (ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్)లో ఖాతాను తెరిచి వేలిముద్ర లేదా ముఖ ఆధారిత ప్రామాణికత ద్వారా నగదు లావాదేవీలు, నగదు ఉపసంహరణ చేసుకోవచ్చని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. ఈమేరకు పోస్టర్లను మంగళవారం కలెక్టరేట్‌లో విడుదల చేశారు. తపాలా బ్యాంకు ద్వారా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అందించే సేవలను పొందవచ్చన్నారు. ఏలూరు డివిజన్ పోస్టాఫీసుల సూపరింటెండెంట్ ఎస్.శ్రీకర్‌బాబు మాట్లాడు తూ ఐపీపీబీ ఖాతాను ప్రారంభించేందుకు పోస్టాఫీసు డోర్‌స్టెప్ సర్వీసు కోసం 155299 లేదా 033-2202900 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. డివిజన్ పోస్టాఫీసుల ఏఎస్పీ డి.శ్రీనివాస్, ఐపీపీబీ మేనేజర్ కె.రాజేష్ పాల్గొన్నారు.



పెయ్యేరులో ఇంటింటా చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీపీవో అనురాధ

పారదర్శకంగా స్వమిత్వ సర్వే : డీపీవో

ముదినేపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో ఖచ్చితమైన భూ రికార్డులను రూపొందించేందుకు చేపట్టిన స్వమిత్వ యోజన సర్వే కార్యక్రమాన్ని అధికారులు పారదర్శ కంగా త్వరితగతిన పూర్తి చేయాలని డీపీవో కొడాలి అనురాధ ఆదేశించారు. పెయ్యేరు, కాకరవాడ గ్రామాల్లో స్వమిత్వ సర్వేతోపాటు ఇంటింటా చెత్త సేకరణ పనుల నిర్వహిస్తున్న తీరును ఆమె డిప్యూటీ ఎంపీడీవో అశోక్‌తో కలసి మంగళ వారం పరిశీలించారు. గ్రామాల్లో నివాస గృహాల సమీప ప్రదే శాల్లో చెత్త నిల్వలు లేకుండా చూడాలని పంచాయతీ కార్య దర్శులను డీపీవో ఆదేశించారు. గ్రామాల్లో డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలని, అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టాలని, పెయ్యేరు, కాకరవాడ గ్రామాల్లో ప్రజలు డీపీవోను కోరారు. కార్యదర్శులు జి.రమేష్, బి.జకర్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ గ్రీవెన్స్‌కు..

నేటితో ముగియనున్న గడువు

- ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు 4,106
- పరిశీలన తర్వాత అర్హులకు పథకం వర్తింపు

ఏలూరుసిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి గ్రీవెన్స్‌కు నేటితో గడువు ముగియ నుంది. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకానికి సంబం ధించి ఆగస్టు 2వ తేదీన అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాలకు నిధులు జమ చేసింది. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.ఐదు వేలు, పీఎం కిసాన్ కింద రూ. రెండు వేలు కలిపి మొదటి విడతగా రూ.7వేలు చొప్పున జిల్లాలో 1,60,968 మంది రైతులకు రూ.107.08 కోట్లు జమ చేశారు. అయితే అప్పట్లో అర్హత ఉండి ఈ పథకానికి అర్హత సాధించని వారు గ్రీవెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది.

గ్రీవెన్స్‌కు దరఖాస్తులు ఇలా..

ఆగస్టు 3వ తేదీ నుంచి ఈ గ్రీవెన్స్ దరఖాస్తులు స్వీకరిస్తు న్నారు. అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయక ముందు తమకు అర్హత ఉండి జాబితాల్లో పేర్లు లేకపోవడంతో 1,988 మంది గ్రీవెన్స్‌కు దరఖాస్తు చేసుకోగా, అన్నదాత సుఖీభవ పథ కానికి నిధులు విడుదల చేసిన తర్వాత ఇప్పటివరకు గ్రీవెన్స్‌లో 2,138 మంది మొత్తం 4,106 మంది అన్నదాత సుఖీభవ గ్రీవెన్స్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కొత్తగా పొలాలు కొనుగోలు చేసినవారు, వెబ్‌ల్యాండ్‌లో ఆధార్ తప్పుగా నమోదు చేసుకున్న వారు, ఈకేవైసీ కాని వారు, హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో ఆధార్ తప్పుగా నమోదు చేసుకున్నవారు, డెత్ మ్యుటేషన్స్, పంట పొలాలకు సంబంధించి ఆధార్ నెంబర్ లింక్ కాని వారు ఈ గ్రీవెన్స్‌లో ఎక్కువగా దరఖాస్తులు చేసుకున్నారు. అలాగే అర్హత ఉన్నా ఇంకా అనేక కారణాలతో పథకానికి అర్హత సాధించని వారు కూడా గ్రీవెన్స్‌కు దరఖాస్తు చేసుకున్నారు. గ్రీవెన్స్‌కు దరఖాస్తు చేసుకోవడానికి బుధవారం సాయంత్రంతో గడువు ముగుస్తుంది. ఆపై దరఖాస్తులను పరిశీలించి తిరిగి అర్హులుగా గుర్తించిన వారికి అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇదిలా ఉండగా మొదట విడతలో అర్హత ఉన్నా ఇంకా కొంత మందికి నిధులు జమ కాలేదని చెబు తున్నారు. బ్యాంకు ఖాతాల్లోని సమస్యలు, ఇతర కారణాలతో నిధులు జమకాలేదని చెబుతున్నారు.

రోగాల నివారణకు ప్రత్యేక చర్యలు

డీఎంహెచ్‌వో జాన్ అమృతం

మండవల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వచ్చే రోగాల నివారణకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నట్టు డీఎంహెచ్‌వో జాన్ అమృతం పేర్కొన్నారు. లోకుముడి, మండవల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో దోమల వ్యాప్తికి ఆస్కారం ఎక్కువగా ఉందని దీనివల్ల అనేక వ్యాధులు ప్రబలుతున్నా యని వివరించారు. వర్షాకాలం ఎదురు కోవడానికి పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉన్నామన్నారు. అనంత రం రికార్డులు పరిశీలించారు. రికార్డులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని లేకుంటే కఠిన చర్యలు తప్పవన్నారు. త్వరలో ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న సిబ్బంది నియామకానికి ప్రభుత్వం చేపట్టిందన్నారు. వైద్యాధికారి పవిత్ర, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి జాన్ అమృతం

పీ- 4 సభకు ఉత్సాహంగా..

- జిల్లా నుంచి 206 కుటుంబాలు.. 30 మంది మార్గదర్శకులు హాజరు

ఏలూరు,ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పేద రిక నిర్మూలన ధ్యేయంగా సీఎం చంద్ర బాబు నాయుడు చేతుల మీదుగా మంగళ వారం మంగళగిరిలో ప్రారంభమైన పీ-4 అధికారిక ప్రారంభోత్సవానికి జిల్లా నుంచి ఉత్సాహంగా నియోజకవర్గాల నుంచి తరలి వెళ్లారు. తొలి విడతగా జిల్లాలో ఏడు నియోజక వర్గాల నుంచి మొత్తం ఏడు బస్సుల్లో 206 మంది బంగారు కుటుం బాలు, వారిని దత్తత తీసుకున్న 30 మంది మార్గదర్శకులు తరలివెళ్లారు.ఈ కార్యక్రమం సర్వే ప్రారంభించిన కాలం నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 72,499 మంది బంగారు కుటుంబాలను గుర్తించగా, మార్గదర్శకులు 718 మంది వీరిని దత్తత తీసుకోవడానికి ముందుకొచ్చారు. అత్యధికంగా పోలవరం లో 12,390 బంగారు కుటుంబాలు ఉండ గా, వీరిని 220 మంది దత్తత తీసుకోవడా నికి ముందుకొచ్చారు. రాబోయే రోజుల్లో పేదరిక నిర్మూలన ఎలా చేయాలి, ఆయా వర్గాలకు ప్రధానంగా విద్య, వైద్యం ఈ మేరకు అందించాలో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. జిల్లా ముఖ్యప్రణాళి కాధికారి వాసుదేవరావు, కార్యాలయ సి బ్బంది, పీ-4కు సంబంధించిన వివిధ టీమ్ ల్లోని 30 మంది సభ్యులు హాజరయ్యారు.

వినాయక చవితికి నిబంధనలు పాటించండి : ఎస్పీ



ఏలూరు క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి ఉత్సవాల వల్ల ఎదుటి వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పండుగ జరుపుకోవాలని ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిశోర్ జిల్లా ప్రజలకు సూచించారు. ఈనెల 27వ తేదీన వినాయక చవితి పండుగను పురస్కరించుకుని నిర్వహించనున్న ఉత్సవా లకు ముందస్తుగా పోలీసు అనుమతి పొందా లని సూచించారు. జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందని ఎవరైనా ఉల్లంఘిస్తే సెక్షన్ 32 పోలీస్ యాక్టు ప్రకారం లేదా 223 బీఎన్ఎస్ సెక్షన్ ప్రకారం ఆరు నెలలు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా లేదా రెండూ విధించబడతాయన్నారు. ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు ముందుగా పోలీసు అధికారుల అనుమతి తీసుకోవా లన్నారు. విగ్రహాలను ట్రాఫిక్‌కు అంతరా యం కలుగ కుండా ఏర్పాటు చేసుకోవా లన్నారు. స్పీకర్లను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంట ల వరకు మాత్రమే వినియోగించాలన్నారు. వినాయకుడి నిమజ్జనం చేసే సమ యాలను, రూట్ మ్యాప్‌ను ముందుగా పోలీసులకు తెలపాలన్నారు. బాణసంచా ఉపయోగించ రాదన్నారు. నిమజ్జన సమయంలో అశ్లీల నృత్యాలు, డీజే శబ్దాలు వినియోగించకూడద న్నారు. పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేసే మండపాల వద్ద తాత్కాలిక సీసీ టీవీతో నిఘా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

రిజిస్ట్రేషన్ల ఆదాయంలో పురోగతి

- గతేడాదితో పోలిస్తే మూడు శాతం పెంపు
- నాలుగు నెలలకు రూ.133 కోట్ల ఆదాయం .. స్లాట్, ఆటోమ్యుటేషన్లతో కక్షిదారులకు ఊరట

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

రిజిస్ట్రేషన్ల శాఖలో సంస్కరణల ఫలితంగా ఆదాయం పెరిగింది. జిల్లా వ్యాప్తంగా ఏలూరు రిజిస్ట్రార్, 11 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ల ఆదాయం పుంజుకుంది. గతేడాది ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలలకు కలిపి 65.05 శాతం ఆదాయం రాగా, ఈ ఏడాది నాలుగు నెలలకు 68 శాతం ఖజానాకు రాబడి పెరిగింది. ఈ ఏడాది ఏప్రిల్ 4 నుంచి ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ విధానంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభ మైంది. అనంతరం పదిరోజుల్లోనే మిగిలిన 11 చోట్ల ఇదే విధానం అమలుతో రోజుకు ప్రతీ కార్యాలయం నుంచి సగటును 50 నుంచి 80 తగ్గకుండా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఈ విధానంలో జాప్యం లేకుండా వేగంగా కక్షిదారులకు క్రయ,విక్రయాలు జరుగుతుండడంతో ఆదాయం కనిపిస్తోంది. దీనికితోడు ఆటో మ్యుటేషన్ల సాఫ్ట్‌వేర్‌ను ప్రభుత్వం సరళతరం చేయడంతో భూముల క్రయ, విక్రయాలు జరిగిన గంటల్లోనే మ్యుటేషన్ల జరగడంతో రిజిస్ట్రేషన్లను ప్రజలు వేగంగా చేసుకోవడానికి అవకాశం ఏర్పడింది. రెవెన్యూ రికార్డులతో పాటు రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రికార్డుల అప్‌డేట్ చేయడం వల్ల అన్ని డాక్యుమెంట్‌లు సక్రమంగా ఉంటే పావుగంటలోనే రిజిస్ట్రేషన్ పూర్తి అయిన దాఖలాలు ఉన్నాయి.

నాలుగు నెలల్లోనే రూ.133 కోట్లు

జిల్లాలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లశాఖ ఆదాయం వసూళ్ల లక్ష్యం ఈ ఏడా దికి రూ.483 కోట్లుగా ప్రభుత్వం నిర్దేశించింది. ఆగస్టు నాటికి నాలుగు నెలలకు రూ.200 కోట్లు లక్ష్యం కాగా, ఇందులో రూ.133 కోట్లు ఆదాయం లభించింది. వీటికి గాను 33,569 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి. గతేడాది ఆగస్టు నాటికి రూ.205 కోట్ల లక్ష్యం కాగా రూ.134 కోట్లతో 65 శాతమే లక్ష్యాన్ని సాధించింది. రిజిస్ట్రేషన్ల శాఖలో వివిధ సంస్కరణలు తీసుకురావడం, స్లాట్ విధానం వల్ల ఆదాయం పెరుగుదల ఆశించిన విధంగానే ఉందని జిల్లా రిజి స్ట్రార్ కె.శ్రీనివాసరావు ఆంధ్రజ్యోతికి చెప్పారు. పలు కార్యాలయాల్లో ఇబ్బం దులు ఎదురైనా వెంటనే తాము వెళ్లి వాటిని సకాలంలో పరిష్కరిస్తున్నట్టు తెలిపారు.



నీళ్లతో మద్యం కల్తీ

లోపలి పేజీలో..

కేజీబీవీలో సీఆర్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వేలేరులోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయ (కేజీబీవీ)లో సోషల్ స్టడీస్, ఫిజిక్స్ సబ్జెక్టులను బోధించేందుకు రెండు సీఆర్టీ పోస్టుల భర్తీకి అర్హతలు గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ పంకజ్‌కుమార్, జీసీడీవో నవీనకుమారి తెలిపారు. విద్యా ర్హతలు, అనుభవం, తదితర వివరాలను నోటిఫికేషన్‌లో పొందుపరిచి నట్టు వివరించారు. అన్ని ధ్రువీకరణ పత్రాల అటెస్టెడ్ ఫొటోస్టాట్ కాపీ లు, పాస్‌పోర్టుసైజు ఫొటోను జతచేసిన దరఖాస్తులను ఈనెల 25వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా ఏలూరు సమగ్రశిక్ష కార్యాలయంలో అభ్యర్థులు అందజేయాలని కోరారు. ప్రస్తుతం సర్వీసులో వున్న ప్రభుత్వ/జడ్పీ ఉపాధ్యాయులతో పాటు, రిటైర్డ్ టీచర్లు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి.. పాల్గొన్న అధికారులు

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

రహదారి భద్రతా కమిటీ సమావేశంలో ఏలూరు జిల్లా కలెక్టర్

ఏలూరు క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై నివారించ దగినది, నివారించలేని, వాహన ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలను గుర్తించి నివేదిక సమర్పించాలని ఆర్‌అండ్ బీ, పోలీస్, నేషన్ హైవే, రవాణా శాఖ అధికారులతో కూడిన సబ్ కమిటీని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని కలపర్రు నుంచి గుండుగొలను వరకు గల జాతీయ రహదారిపై అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన దాబా,హోటల్స్, ఇతర శాశ్వత, తాత్కాలిక నిర్మాణాలు రోడ్డు భద్రతా, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్నదీ లేనిదీ పరిశీ లించాలని ఏలూరు ఆర్డీవోను కలెక్టర్ ఆదేశించారు. జాతీయ రహదారిలో ప్రమాదాలకు ఆస్కారం ఉన్న 30 బ్లాక్ స్పాట్స్‌లో తీసుకున్న చర్యలపై సమావేశంలో సమీక్షించారు. వీటిలో ఆరు బ్లాక్ స్పాట్స్‌తో తీసుకోవాల్సిన చర్యలను 10 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారిపై గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు పైలట్ ప్రాజెక్టు కింద 5 ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి అత్యవసర వైద్యసేవలు అందించేందుకు భీమడోలు, జంగారెడ్డిగూడెంలో ట్రామా సెంటర్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రమాదాలకు గురికాకుండా బస్సులన్నింటి ఫిట్‌నెస్ తనిఖీలు నిర్వహించాలని ఆర్టీసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, ఆర్‌అండ్‌బి ఎస్ఈ రాజారత్నం, రవాణాశాఖ ఉప కమిషనర్ కరీం, ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్, ఆర్డీవో కృష్ణారావు, ప్రజా రవాణా అధికారి షేక్ షబ్నం, డీఈవో వెంకట లక్ష్మమ్మ పాల్గొన్నారు.



యాగశాలలో అంకురార్పణ జరుపుతున్న పండితులు

సుందరగిరిపై పవిత్రోత్సవాలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సుందరగిరిపై స్వయం వ్యక్తునిగా కొలువుదీరిన లక్ష్మీనారసింహుని వైభవాన్ని మరింతగా చాటేలా నూతనంగా తలపెట్టిన దివ్య పవిత్రోత్సవాలు మంగళవారం ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి. పురాణ ప్రాశస్త్యం కల్గిన ఈ ఆలయం శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయంగా మండలంలోని ఐఎస్ జగన్నాథపురంలో విరాజిల్లుతోంది. ఆలయం నుంచి కనకవల్లీ సమేత లక్ష్మీ నారసింహుల ఉత్సవమూర్తులను తెచ్చి ఆలయ యాగశాలలో ఉంచి పవిత్రోత్సవాలను ప్రారంభించారు. యాగశాలలో ఉదయం మహాగణపతి పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, అంకురార్పణ, అధివాసాలు, ఉదక శాంతి పూజలు నిర్వహించారు. శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురం వేణు గోపాల, జగన్నాథ వేంకటేశ్వర ఆలయంలో జరుగుతున్న దివ్య పవిత్రోత్స వాల్లో భాగంగా మంగళవారం పవిత్రాధివాసం కన్నులపండువగా జరిగింది.

వెంకన్నను నమ్మని వారిని ఉద్యోగాల నుంచి తొలగించాలి

ఆధ్యాత్మిక వేత్త రాధా మనోహర్ దాస్



ద్వారకాతిరుమల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల వేంకటే శ్వరస్వామిని నమ్మని వారు ఇదే దేవాలయంలో పనిచేస్తున్నారని అటువంటి వారిని గుర్తించి ఉద్యోగాలనుండి తొలగించాలని ఆధ్యాత్మిక వేత్త రాధా మనోహర్‌దాస్ డిమాండ్ చేశారు. ద్వారకా తిరుమల ఆలయాన్ని సోమవారం రాత్రి దర్శించిన ఆయన దర్శనానంతరం ఆలయ జంట గోపురాల సమీపంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. హిందూ దేవాలయాల్లోనూ హిందువులే పనిచేయాలన్నారు. ఆలయాలకు వచ్చే భక్తుల నుండి డబ్బులు ప్రసక్తి లేకుండా దైవదర్శనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయాల్లో చెప్పులు, బ్యాగులు, సెల్‌ఫోన్లు భద్ర పరచుకోవడానికి డబ్బులు వసూలు చేస్తుండటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గుడికి వస్తే ప్రతీ దానికీ డబ్బులు వసూలు చేస్తున్నారని అందుకే హిందువులు పక్క మతాలకు వెళ్లిపోతున్నారన్నారు. ద్వారకా తిరుమలేశుని ఆలయ పరిసర ప్రాంతాల్లో గోవింద నామాలను కన్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే అన్నమయ్య కీర్తనలు ఆలయ పరిసరాల్లోని అన్ని ప్రాంతాల్లోను భక్తులకు కన్పించేలా రాయాలని విజ్ఞప్తి చేశారు.



జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక

ఏలూరు రూరల్, ఆగస్టు 19, (ఆంధ్రజ్యోతి) : బిహార్ రాష్ట్రంలోని కాల్ చక్ర మైదానంలో ఈనెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు శనివారపుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. జక్కుల శ్యాంసుందర్, గోడ జాన్ పాల్ ఇటీవల చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచారు.షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బిహార్‌లో 44వ జాతీయస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరుపున వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. ప్రకాశ రావు, పద్మలత, ఫ్రాన్సినా, ఎస్ఎంసి సభ్యులు అభినందించారు.

బాబోయ్ దోమలు..



నిడమర్రు ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మనిషి అన్నింటి పైనా విజయం సాధించినా దోమలను చూస్తే మాత్రం బేజారెత్తిపోతున్నాడు. దోమల ద్వారానే మనిషి ఎక్కువగా రోగాల బారిన పడతాడు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం ద్వారా దోమలు వ్యాప్తి చెందుతాయి. ముఖ్యంగా మూడు రకాల దోమలు వ్యాధులకు గురిచేస్తాయి. క్యూలెక్స్, అనాఫిలస్, ఏడిస్ దోమల వల్ల తీవ్రమైన జ్వరాల బారిన పడుతుంటారు. మనిషికి సంభవించే అనారోగ్యంలో 40 శాతం దోమల కారణంగా వస్తున్నాయని వైద్య నివేదికల ద్వారా తెలుస్తోంది. ప్రాణాంతకమైన మలేరియా వ్యాధి అనాఫిలస్ అనే ఆడదోమ కుట్టడం వల్ల వస్తుందని సర్ రోనాల్డ్ రాస్ అనే శాస్త్రవేత్త ఆగస్టు 20వ తేదీన గుర్తించడంతో ఏటా ఆగస్టు 20న వరల్డ్ మస్కిటో డేగా పాటిస్తున్నారు. నేడు దోమల దినోత్సవం సందర్భంగా అవగాహన కోసం ప్రత్యేక కథనం..

అనారోగ్యానికి మూలం దోమలే

అపరిశుభ్ర వాతావరణంలో వ్యాప్తి

జాగ్రత్తలతోనే దూరం

నేడు దోమల నివారణ దినోత్సవం

దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు

దోమ కాటు ద్వారా మలేరియా, మెదడువాపు , బోదకాలు, డెంగీ, చికున్ గున్యా వంటి జ్వరాలు వ్యాపిస్తాయి.

మలేరియా వ్యాధి : జూలై నుంచి నవంబరు మాసాల మధ్య వ్యాప్తి చెందే ఆడ అనాఫిలిస్ దోమ కుట్టడం ద్వారా ఈ వ్యాధి వస్తుంది. ఈ దోమ ప్లాస్మాడియం సూక్ష్మజీవులు గల రోగులను కట్టి రక్తం పీల్చడం ద్వారా తర్వాత ఆరోగ్య వంతులను కుట్టినప్పుడు వారి రక్తంలో సూక్ష్మ జీవులను సంక్రమింపచేస్తుంది. దీని నివారణకు వైద్యం తీసుకోవడంతో పాటు ఇంటి పరిసరాల్లో దోమలు లేకుండా చేసుకోవాలి.

మలేరియా నుంచి కాపాడే కొత్త అవతార్ (టీకా) దోమల్ని శాస్త్రవేత్తలు ఆవిష్కరించారు. ఈ దోమలు కుడితే మనిషిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. తద్వారా మలేరియాను నియంత్రించ డానికి వీలవుతుంది. దోమ లాలాజల గ్రంధుల నుంచి లైస్మేనియా టీకా మందు వెలువడేలా జన్యు పరమైన మార్పులు చేశారు. ఇది మలేరియా పరాన్న జీవి ప్లాస్మోడియం రాకను నిరోధిస్తుంది.

మెదడు వాపు : జపనీస్ బి అనే వైరస్ సూక్ష్మజీవి దోమల ద్వారా, ఇతర జంతువుల ద్వారా సంక్రమిస్తుంది. ముఖ్యంగా పందులు, పశువులు, గుర్రాలు, కొంగలు ఈ వైరస్ ముఖ్య స్థావరాలు...దోమలు వీటిని కుట్టి మరలా మనిషిని కుట్టినపుడు ఈ వైరస్ మనిషికి వ్యాప్తి చెందుతుంది. సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకు మెదడు వాపు వ్యాధి ప్రబలుతుంది. వర్షం ద్వారా వచ్చే నీటి స్థావరాలలో దోమల ఉత్పత్తి పెరిగి క్యూలెక్స్ దోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది.

పైలేరియా (బోదకాలు) : బోదకాలు వ్యాధి హెల్మెంత్ వర్గానికి చెందిన సన్నని పరాన్న జీవి ద్వారా సంక్రమిస్తుంది. ఈ పరాన్న జీవి గల మనిషిని కుట్టిన దోమ రక్తం పీల్చినప్పుడు ఆ రక్తంతో పాటు దోమ శరీరంలోకి ప్రవేశించి 15 రోజుల పాటు వృద్ధి చెంది మరో వ్యక్తిని దోమ కుట్టినప్పుడు ఆ వ్యక్తి శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఈ వ్యాధిని క్యూలెక్స్ దోమ మాత్రమే వ్యాప్తి చేయగలుగుతుంది.

డెంగీ జ్వరం : ఆర్బోవైరస్ ద్వారా సంక్రమించే ఈ డెంగీ జ్వరం ఏడిస్ దోమ ద్వారా రోగుల నుంచి ఆరోగ్యవంతులకు సంక్రమిస్తుంది. ఈ దోమను టైగర్ దోమ అని కూడా పిలుస్తారు. ఈ దోమలు సాధారణంగా పగటిపూట మాత్రమే కుడతాయి. దోమ కుట్టిన 8 రోజుల్లో వ్యాధి లక్షణాలు కన్పిస్తాయి

చికున్ గున్యా : చికెన్ గునియా వ్యాధి ఏడిస్ దోమ ద్వారా వ్యాపిస్తుంది. ఈ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి నుంచి ఆరోగ్యవంతుడైన వ్యక్తికి ఈ దోమ కుట్టడం ద్వారా సంక్రమిస్తుంది.

లింఫాటిక్ పైలేరియాసిస్ : మనిషికి శారీరక వికలాంగత్వానికి కారణమయ్యే ఈ రోగం దోమల ద్వారానే వ్యాపిస్తుంది. దోమ కాటు ద్వారా లింఫటిక్ ఫైలేరియాసిస్ ఒకరి నుంచి మరొకరికి బదిలీ అవుతుంది. దోమ శరీరంలో మైక్రోఫైలియా వ్యాధి 7 నుంచి 21 రోజుల పాటు వృద్ధి చెంది రోగాలను వ్యాపింప చేస్తుంది. శారీరక వైకల్యానికి దారి తీస్తుంది.



దోమల నివారణకు చర్యలు :

నీరు నిల్వ ఉండే ప్రాంతాలు, చెత్తాచెదారం ఉండే చోట్ల శుభ్రం చేయాలి.. ఫ్రిజ్‌లో, కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పూలకుండీలలో నిల్వ ఉండే చోట దోమలు పెరిగే అవకాశం ఉండడంతో ఆ ప్రాంతాలను శుభ్రం చేయాలి. సెప్టిక్ ట్యాంకు గొట్టాల వద్ద తీగ మెస్ వేయించాలి. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. వారానికి మూడు సార్లు ఫాగింగ్ చేసి దోమల వ్యాప్తిని అరికట్టవచ్చు.

45 రోజులకు ఒకసారి ఏజెన్సీలో మలాథియాన్ స్ప్రే



మలేరియా వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కోసం ఆగస్టు 20న ప్రపంచ దోమల దినోత్సవం నిర్వహిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా దోమల నియంత్రణ కోసం వైద్య ఆరోగ్య సిబ్బందితో కలసి ఫ్రైడే - డ్రై డే నిర్వహించి ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి వాటిని తొలగిస్తున్నాం సర్వే నిర్వహిస్తూ ఆర్‌డీటీ కిట్లు ద్వారా 10 నిమిషాలలో రోగ నిర్ధారణ జరుగుతుంది. మలేరియా నిర్ధారణ అయితే తక్షణం వైద్య సదుపాయం అందించడంతో పాటు చుట్టుపక్కల 50 కుటుంబాల వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. 2021లో ఏజెన్సీ ఏరియాలో దోమతెరలను పంపిణీ చేశాం. ప్రస్తుతం దోమ తెరల కోసం ప్రతిపాదనలు పంపించాం. మలేరియా నియంత్రణ కోసం మలాథియాన్ ద్రావణం బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం మండలాలో 45 రోజులకొకసారి పిచికారీ చేస్తున్నాం. కుక్కునూరు, వేలేరుపాడు మండలాలలో ఏసీఎం ద్రావణాన్ని 60 రోజులకొకసారి పిచికారీ చేస్తున్నాం. ప్రతి పీహెచ్‌సీలోనూ మందులను అందుబాటులో ఉంచాం.

- పీఎస్ఎస్ ప్రసాద్, జిల్లా మలేరియా అధికారి, ఏలూరు

ఏజెన్సీపై మలేరియా దాడి



బుట్టాయగూడెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో సంవత్సరం పొడవునా మలేరియా కేసులు నమోదవుతూనే ఉన్నాయి.దోమల నివారణకు ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ ఎన్ని చర్యలు తీసుకుంటున్నా అదుపులోకి రావడం లేదు. ఏడాదికి మూడుసార్లు దోమల నివారణ మందును స్ప్రేయింగ్ చేస్తారు. వేసవిలో మలేరియా తగ్గుముఖం పట్టినా వర్షాలు ప్రారంభం కాగానే విజృంభిస్తోంది. ఏజెన్సీలో ఐదు మండలాల్లోని అటవీ ప్రాంతాలకు దగ్గరగా ఉండే గ్రామాల్లో కేసులు నమోద వుతుం టాయి. దోమ కాటు వల్ల మలేరియాతో, డెంగీ, చికున్‌గున్యా, పైలేరియా, మెదడువాపు వ్యాధులు వస్తాయి. అన్ని వ్యాధులతో పోలిస్తే మలేరియా ప్రాణాంతకమైనది. మలేరియాను అశ్రద్ధ చేస్తే వ్యాధి ముదిరి మెదడకు చేరి ప్రాణాలను హరించే ప్రమాదం ఉంది. జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే రక్తపరీక్షలు చేయించుకోవడం వైద్యుడిని కలిసి మందులు వాడటం చేయాలి. జిల్లాలో నమోదయ్యే మలేరియా కేసుల్లో 90 శాతంపైగా కేసులు ఏజెన్సీలోనే ఉంటున్నాయి. ఏలూరు జిల్లా పశ్చిమ ఏజెన్సీలో అధికారుల లెక్కల ప్రకారం జనవరి నుంచి ఇప్పటివరకు 400 పైగానే మలేరియా కేసులు నమోదయ్యాయి.

నివారణ చర్యలు

ముఖ్యంగా దోమలు నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో అధికంగా పుట్టుకొస్తాయి. పాడైపోయిన వస్తువులు, ప్లాస్టిక్ వస్తువులను పడవేయడం వల్ల వాటిలో నీరు చేరడంతో దోమలు పుట్టి పెరుగుతాయి. ఏజెన్సీలో వాగులు, వంకలు, కాలువలు, పచ్చని చెట్లు అధికంగా ఉండటం వల్ల పలుచోట్ల నీరు నిల్వ ఉండి దోమల పుట్టుకకు పెరుగుదలకు దోహదపడుతుంది. అపరిశుభ్ర ప్రాంతాలు, పరిసరాలు శుభ్రంగా లేకపోవడం దోమలు పెరుగుదలకు కారణం. దోమతెరలను వాడటం వలన 75 శాతం దోమకాటు వ్యాధులను అరికట్టవచ్చని వైద్యాధికారులు స్పష్టం చేస్తున్నారు. ఐఆర్ఎస్(ఇండోర్ రెసిజ్వల్ స్ప్రేయింగ్), ఐఎస్ఎస్ (ఇండోర్ స్పేస్ స్రేయింగ్)ను క్రమం తప్పకుండా చేయడం యాంటీ లార్వా ఆపరేషన్ పనులను తరుచుగా చేపట్టడం వలన దోమలను నివారించవచ్చు. ఏజెన్సీవాసులకు దోమతెరలు పంపిణీ చేసి 4 సంవత్సరాలు దాటుతున్నందున వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. మందు వాసన భరించలేక చాలామంది ఇళ్ల లోపల స్ప్రేయింగ్ చేయంచడం లేదని అందుకే దోమలు పెరుగుతున్నాయని మలేరియా అధికారులు తెలియజేస్తున్నారు.ఆసుపత్రుల్లో నాణ్యమైన మందులను అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లో ఫీవర్ సర్వే చేస్తున్నాం

ప్రతి గ్రామంలో ఫీవర్ సర్వే చేస్తున్నాం. జ్వరపీడితులు ఉండే ఆర్‌డిటి రక్త పరీక్షలు చేసి మలేరియాగా నిర్ధారణ అయితే అవసరమైన మందులు ఇస్తున్నాం. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డేగా పాటిస్తున్నాం. దోమల పెరుగుదలకు కారణాలను వివరిస్తూ నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

- జె.సురేష్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో





పెంటపాడులో ముంపులోనే వరిపొలాలు.. కొడమంచిలి చినమల్లం రోడ్డులో భారీ వర్షానికి కుళ్లిన వరినాట్లు

కుళ్లుతున్న వరి నాట్లు

పశ్చిమ గోదావరి జిల్లాలో 17,750 ఎకరాలు మునక

పెంటపాడులో 6,300 ఎకరాలు

పెంటపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ముంపునకు గురైన పొలాల నుంచి వర్షం నీరు ఇప్పుడిప్పుడే కొద్దికొద్దిగా బయటకు మళ్లుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో 20 మండలాలకు సంబంధించి మొత్తం 17,750 ఎకరాలు ముంపునకు గురైనట్లు అధికారులు అంచనా వేశారు. వీటిలో అత్యధికంగా పెంటపాడు మండలంలోనే 6,300 ఎకరాలు ముంపు బారిన పడినట్లు తె లుస్తోంది. లోలెవెల్ కాలువ పరిధిలోని పెంటపాడు, కే.పెంటపాడు, యానాలపల్లి, పరిమెళ్ళ తదితర గ్రామాల్లో పొలాలు మునిగి పోయాయి.జరిగిన నష్టంపై అధికారులు నివేదిక సిద్ధం చేస్తున్నారు.ముంపు పొలాలలో నీరు బయటకు మళ్ళుతున్నప్పటికి ఇప్పటికే సుమారు 7 రోజుల నుంచి వర్షపు నీటిలోనే పొలాలు ఉండిపోయాయి. దీంతో నారు ఎంతవరకూ పనిచేస్తుందో తెలియక రైతులు అయోమయానికి గురి అవుతున్నారు. అధికారులు మాత్రం ప్రస్తుతానికి ఎటువంటి ఇబ్బంది లేదని వర్షపు నీరు మొత్తం బయటకు వెళ్ళిపోతే ఎకరానికి 20 కేజీలు, యూరియా 15 కేజీల పొటాషియం చల్లుకుంటే సరిపోతుందని చెబుతున్నారు. పొలాలకు పురుగు పట్టకుండా, తెగుళ్ళ రాకుండా చూసుకోవాలంటున్నారు. నారు పూర్తిగా పాడైపోతే నర్సాపురం మండల సమీపంలో నారు దొరుకుతుందని అక్కడి నుండి తెచ్చుకుని వేసుకోవాల్సి ఉంటుందని రైతులు అంటున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.10 వేలకు పైగా పెట్టుబడులు పెట్టామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు

ఇంకా నీటిలోనే వరినాట్లు

ఆచంట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి):ఇటీవల కురిసిన కుండపోత భారీ వర్షానికి మండలంలో పలుచోట్ల నాట్లువేసిన పంట పొలాలు నీటమునిగి ఇంకా చెరువులను తలపిస్తున్నాయి. ఆచంట వేమవరం, ఆచంట, పెనుమంచిలి, వంటి గ్రామాల్లో ఇంకా నీటిలోనే వరినాట్లు నానుతున్నాయి. దీంతో కొన్ని రోజులుగా వరినారులు ముంపులో ఉన్న కారణంగా కుళ్ళిపోయే అవకాశం ఉందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాట్లు వేసే సమయానికి ఎకరాకు రూ. 15 వేలు పైగా ఖర్చు అయ్యిందని రైతులు చెబుతున్నారు. ముంపుబారిన పంట పొలాలకు సంబంధించి రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఢిల్లీలో మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందించిన కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, సంఘ ప్రతినిధులు

ఆక్వా రంగాన్ని ఆదుకోవాలి

లోకేశ్‌కు వినతిపత్రం ఇచ్చిన ఆక్వా ఎక్స్‌పోర్టు సంఘ ప్రతినిధులు

భీమవరం టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఆక్వా పరిశ్రమను ఆదుకోవటానికి చర్యలు తీసుకోవాలని భారత సముద్ర ఆహార ఎగుమతుల సంఘం ప్రతినిధులు ఢిల్లీలో ఉన్న రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆధ్వర్యంలో జరిగిన భేటీలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీలు సానా సతీష్ బాబు, లావు శ్రీకృష్ణదేవరాయలు, బీద మస్తాన్ రావులు హాజరై, సంఘ ప్రతినిధులతో కలిసి లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. అమెరికా ప్రభుత్వం ఇటీవల భారత సముద్ర ఆహార ఎగుమతులపై టారిఫ్ విధించడంతో, ఎగుమతి రంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొం టుందన్నారు. ఇందుకోసం ప్రత్యేక ఆర్థిక సాయం, వడ్డీ రాయితీలు, వర్కింగ్ క్యాపిటల్ సపోర్టు, పన్నులు వంటి ఉపశమన చర్యలు కేంద్రం అమలు చేసేలా సహకరించాలని కోరారు. లోకేష్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ఆక్వా పరిశ్రమ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి ఈ సమస్యలను తీసుకువెళ్లి, తగిన పరి ష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భారత సముద్ర ఆహార ఎగుమతిదారుల సంఘం అధ్యక్షుడు పవన్ కుమార్, సీఈవో డాక్టర్ రాఘవన్, జాతీయ కమిటీ సభ్యుడు గంగారాం తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు, జనసేన నాయకులు

ఆసియా కప్ భారత జట్టు మేనేజర్‌గా ప్రశాంత్

భీమవరంటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఆసియా కప్ భారత జట్టుకు మేనేజర్‌గా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు కుమారుడు వెంకట ప్రశాంత్ నియమితులయ్యారు.ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జనసేన నాయకులు యర్రంశెట్టి శివకృష్ణ ఆధ్వర్యంలో సంబరాలను నిర్వహించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు కేక్ కట్ చేసి కూటమి నాయకులకు స్వీట్స్ పంచారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వర రావు, ఏఎంసి వైస్ చైర్మన్ బండి రమేష్ కుమార్, జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, వబిలిశెట్టి రామకృష్ణ, పత్తి హరి వర్ధన్, యర్రంశెట్టి శివకృష్ణ, మండల కార్యదర్శి కత్తుల నీలేంద్ర మాట్లాడుతూ దుబాయ్ వేదికగా వచ్చేనెల 9 నుంచి ఆసియా కప్ క్రికెట్ మ్యాచ్‌లు జరగనున్నాయని, ఇండియా టీమ్‌కు భీమవరానికి చెందిన ప్రశాంత్ నియమితులు కావడం ఆనందించదగ్గ విషయమని, రానున్న రోజుల్లో మరింత ఉన్నత పదవులను అధిరోహించాలన్నారు. ఈ టోర్న మెంట్ టి-20 ఫార్మాట్లో జరుగుతాయన్నారు. కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

జిల్లాలో సరిపడా ఎరువులు ఉన్నాయి : కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరుసిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయని , ఎటువంటి కొరత లేదన్న విషయాన్ని ప్రతీ రైతుకు తెలియజేయాలని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి వ్యవసాయ శాఖాధికారులను ఆదేశించారు. ఎరువుల లభ్యత, అన్నదాతా సుఖీభవ అంశాలపై జిల్లాలోని వ్యవసాయ శాఖాధికారులతో మంగళవారం జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్‌కు అవసరమైన ఎరువులు, డీఏపీ నిల్వలు ఉన్నాయని ఎటువంటి కొరత లేదన్న విషయాన్ని వ్యవసాయశాఖాధికారులు రైతులకు తెలియజేయాలన్నారు. జిల్లాలో ఎరువులపై ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు. అన్నదాతా సుఖీభవ పథకంలో పెండింగ్ ఉన్న రైతుల ఈకేవైసీ వెంటనే పూర్తి చేయాలని, అభ్యంతరాలపై చర్యలు తీసుకోవాలన్నారు.

మూడేళ్లుగా జీతాల్లేవు !

ఎర్రకాలువ జలాశయం ఎన్ఎంఆర్ సిబ్బంది అవస్థలు



జంగారెడ్డిగూడెం,ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలం కొంగువారి గూడెంలోని కరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయం పరిధిలో పనిచేస్తున్న ఎన్ఎంఆర్ సిబ్బందికి గత 36 నెలలుగా జీతాలు లేక దయనీయ స్థితిలో జీవనం కొనసాగిస్తున్నారు. వారిని పట్టించుకునే నాధులే కరువవడంతో ఆందోళన చెందుతున్నారు. 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో ఆరుగురు సిబ్బందిని నియమించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.సత్యనారాయణను పద్దెనిమిది వేల జీతానికి,హెడ్ మజ్దూర్‌లుగా ఎస్.వీరేంద్ర, టి.అశోక్,డి.గాంధీలను రూ.16 వేల జీతానికి, వాచ్‌మెన్‌లు గా ఎస్.శేఖర్ బాబు,పి.లక్ష్మణ్‌లను రూ.15 వేల జీతానికి ఎన్ఎంఆర్‌లు గా విధుల్లోకి తీసుకుంది.గత పదేళ్ళుగా వీరు అదే జీతానికి తమ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తు న్నారు. ప్రాజెక్టు మెయింటెనెన్స్ చూసుకోవడం, గేట్లు రిపేరు చేయడం, కాలువలకు, చెరువు లకు గండ్లు పడకుండా తగిన ఏర్పాట్లు చేయడం, రైతులకు అవసరమైన పంటలకు విడతల వారీగా కుడి,ఎడమ కాలువల నుంచి నీటిని విడుదల చేయడంతో పాటు ప్రాజెక్టు రీడింగ్‌ను నిత్యం గమనిస్తూ అధికారులకు, రైతులకు తెలియజేయడం వంటి అన్ని పనులు చూసుకుంటారు. ఎర్రకాలువ ప్రాజెక్టు పరిధిలో 25 మంది సిబ్బంది పలు బాధ్యతలు నిర్వహించాల్సి ఉండగా వారందరి బాధ్యతలు ఈ ఆరుగురే నిర్వహిస్తున్నారు.హెడ్ మజ్దూర్‌గా పనిచేస్తున్న ఎస్.వీరేంద్ర ప్రస్తుతం ఉద్యోగానికి రాజీనామా చేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జీతాలు సక్రమంగానే వచ్చేవని ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ప్రాజెక్టు మెయింటెనెన్స్ కోసం వచ్చే నిధులతో పాటు తమ జీతాలు కూడా నిలిచిపోయాయని ఉద్యోగులు చెబుతున్నారు. ఆగస్టు 25 లోపు పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.48 లక్షల జీతాలను వెంటనే విడుదల చేయాలని లేదంటే ఆగస్టు 25 నుంచి సమ్మె చేపడతామని హెచ్చరిస్తు న్నారు. చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న తమకు ఆ కొద్ది పాటి జీతం కూడా మూడు సంవత్సరాలుగా ఇవ్వక పోతే తమ కుటుంబా లను ఎలా పోషించుకోవాలని ప్రశ్నిస్తున్నారు. అప్పు ఇచ్చిన వారితో తీవ్ర ఇబ్బందులు దుర్కొంటున్నామంటున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పెండింగ్ జీతాలు విడుదల చేయాలని కోరుతున్నారు.

మెగా డీఎస్సీ నియామకాలపై కసరత్తు

ఏలూరు అర్బన్,ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి):మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు జిల్లాలో కసరత్తు జరుగుతోంది. పరిశీలన విధి విధానాలపై శిక్షణ నిమిత్తం ఒక ఎంఈవో, ఒక ఏపీవోను బుధవారం పాఠశాలవిద్య రాష్ట్ర కార్యాలయానికి పంపాల్సిందిగా డీఈవో కార్యాలయానికి ఆదేశాలందాయి. ముందుగా వెబ్‌సైట్‌లో మెరిట్ లిస్టులను విడుదల చేసిన అనంతరం రోస్టర్ పాయింట్లకు అనుగుణంగా సెలక్షన్ జాబితాలను సిద్ధం చేసి, ఆ సమాచారాన్ని అభ్యర్థుల మొబైల్ ఫోన్లకు తెలియజేసే అవకాశం ఉంది. సర్టిఫికెట్ల పరిశీలనకు జిల్లాల వారీగా జాబితాలను విడుదల చేసి, సంబంధిత అభ్యర్థులను మాత్రమే ఆహ్వానిస్తారు. పరిశీలన ప్రక్రియ తేదీలను మంగళవారం రాత్రి లేదా బుధవారం ప్రకటిస్తారని డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు. పాఠశాల విద్యాశాఖపరిధిలోని ప్రభుత్వ/జడ్పీ/ఎంపీపీ/మున్సిపల్ యాజమాన్యాల్లో 1,035 పోస్టులు, గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలల్లో 32 పోస్టులు, జువనైల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో ఏలూరు రూరల్ మండలం శనివారపుపేటలో నిర్వహిస్తోన్న ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఏడు పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైన విషయం విదితమే. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం తుది నియామకాలు, నూతన ఉపాధ్యాయులకు పోస్టింగ్‌లను సెప్టెంబరు 5వ తేదీ నాటికి పూర్తిచేసే అవకాశాలున్నాయి.

పామాయిల్ రైతుల ప్రయోజనాలు కాపాడతాం

▸ ఎంపీ మహేశ్ ప్రశ్నకు కేంద్రమంత్రి జితిన్ సమాధానం



ఏలూరు,ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పామాయిల్ రైతుల, పరిశ్రమల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ స్పష్టం చేశారు. పామాయిల్‌తో సహా క్రూడ్ వంట నూనెలపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ తగ్గించడం ఆయిల్‌పామ్ రైతులపై పడుతున్న ప్రభావాన్ని లోక్‌సభలో ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం ఇచ్చారు. దేశీయంగా పామాయిల్ ఉత్పత్తి పెరగడంతో పాటు, వినియోగదారులు ధరలను తగ్గేలా చూడడం, రైతులు తమ పంటకు సరైన ధరపొందేలా చూడడం కోసమే అన్ని విధాలా కృషి చేస్తున్నామన్నారు. గతంలో తీసుకున్న డైనమిక్ ఇంపోర్టు డ్యూటీ విధానంలో కొన్ని లోపాలు ఉన్నాయని, వాటిని సరిచేస్తున్నామని, ఇదే సమయంలో దేశం తన వంట నూనెల్లో సుమారు 60 శాతం దిగుమతులపై ఆధారపడి ఉండడం వల్ల అంతర్జాతీయ మార్కెట్ రేట్లకు ఎక్కువగా ప్రభావితం అవుతున్నాయని మంత్రి తెలిపారు.

సెప్టెంబరు 13న జాతీయ లోక్ అదాలత్

▸ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ లక్ష్మీనారాయణ



భీమవరం క్రైం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు భీమవరంలో ఉన్న అన్ని కోర్టుల ప్రాంగణాల్లో సెప్టెంబరు 13న 'జాతీయ లోక్ అదాలత్' నిర్వహిస్తామని సంస్థ చైర్మన్, మూడో అదనపు జిల్లా జడ్జిగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ బి.లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం భీమవరంలో ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో అన్ని సివిల్ కేసులు, రాజీ కాదగ్గ క్రిమినల్ కేసులు, చెక్కు బాకీ కేసులు, దంపతుల మధ్య తగాదా కేసులు, మనోవర్తి, గృహహింస కేసులు, చిట్‌ఫండ్, ఫైనాన్స్ కంపెనీ కేసులు, మోటార్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కేసులు, బీఎస్ఎన్ఎల్ మొండి బాకీ తదితర కేసులు రాజీ చేసుకోవచ్చన్నారు. సివిల్ కేసుల్లో రాజీ చేసుకుంటే అప్పటికే కట్టిన కోర్టు ఫీజు వాపసు వస్తుందన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ అంతిమ తీర్పు కాబట్టి ఇరుపార్టీలు గెలిచినట్లేనని, అప్పీలు చేసుకునే అవకాశం ఉండదన్నారు. న్యాయవాదులు, పోలీసు అధికారులు జాతీయ లోక్ అదాలత్ ప్రాముఖ్యతను కక్షిదారులకు వివరించి ఎక్కువ కేసుల రాజీకి కృషి చేయాలని సూచించారు.

'పీఎం వికసిత్ భారత్ రోజ్గార్'తో జీడీపీ వృద్ధి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఏలూరు,ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్గార్ యోజనతో ఉద్యోగులకు, యాజమాన్యాలకు కేంద్రం నుంచి అదనపు నిధులు వస్తాయని, దేశంలో ఉద్యోగ కల్పన పెరిగి జీడీపీ వృద్ధిరేటు మెరుగు పడుతుందని రాజమహేంద్రవరం ఈపీఎఫ్ రీజనల్ కమిషనర్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. ఏలూరు నగరంలో జిల్లా ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఆఫీస్, సీఆర్ఆర్ రెడ్డి కళాశాలల్లో ఈ పథకంపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించి, ప్రయోజనాలను వివరించారు. పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ రాధానాథ్ పట్నాయక్, సీఆర్‌రెడ్డి కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కేఎస్ విష్ణుమోహన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రామరాజు, శ్రీశ్రీ విద్యాసంస్థల ఛైర్మన్ శర్మ, ఆంధ్రాషుగర్స్, అంబికా ఉత్పత్తుల ప్రతినిధులు, తూర్పు, పశ్చిమ, ఏలూరు మూడు జిల్లాలోని పారిశ్రామికవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు.

తిరుపతి రైలు పునరుద్ధరణ

నరసాపురం,ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నరసాపురం నుంచి తిరుపతి రైలును మంగళవారం నుంచి పునరుద్ధరించినట్లు ఎస్ఎం మధుబాబు తెలిపారు. విజయవాడ-ఒంగోలు మధ్య మూడో లైన్ పనుల్లో భాగంగా ఈనెల 12 నుంచి ఈ రైలును నిలిపివేశారు. మంగళవారం పునరుద్ధరించడంతో తిరుపతి ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. షెడ్యూల్ ప్రకారం నరసాపురం నుంచి అటు ధర్మవరం నుంచి రైలు యధావిధిగా నడవనుంది.



వేల్పుచర్ల కార్యదర్శికి సూచనలిస్తున్న జడ్పీ సీఈవో శ్రీహరి


చెత్త సేకరణను తనిఖీ చేసిన జడ్పీ సీఈవో

ముసునూరు,ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): సంపద కేంద్రాలను సమర్థవంతగా నిర్వహించి, పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చాలని జడ్పీ సీఈవో శ్రీహరి అన్నారు. వేల్పుచర్లలో చెత్తసేకరణను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం సంపద కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడుతూ చెత్త సేకరణ, సంపద కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. కార్యదర్శి శ్రీనివాస చౌదరి, పారుశుధ్య సిబ్బందికి సీఈవో పలు సూచనలు ఇచ్చారు. ఎంపీడీవో బీఏ సత్యనారాయణ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడిపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం మాధవరానికి చెందిన బీజేపీ నాయకుడు వన్నెంరెడ్డి నవీన్‌పై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశామని పోలీసులు మంగళవారం తెలిపారు. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలో నివాసం ఉంటున్న ఓ మహిళతో సన్నిహితంగా ఉంటున్నాడని గమనించి ప్రశ్నించిన ఆమె భర్తపై దాడి చేశాడని దీనిపై ఆమె భర్త మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆ నాయకుడిపై కేసు నమోదు చేశామని సీఐ రవికుమార్ తెలిపారు.

అదుపు తప్పిన ప్రైవేటు స్కూల్ బస్సు



ఆగిరిపల్లి, ఆగస్టు 19 (ఆంధ్ర జ్యోతి): ఆగిరిపల్లిలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ బస్సు మంగళవారం గన్నవరం మండలం, గొల్లనపల్లి గ్రామం నుంచి పది మంది విద్యార్థులతో ఆగిరిపల్లి వస్తుండగా తోటపల్లి శివారు ప్రాంతంలో బస్సు అదుపు తప్పి సైడ్ కాలువలోకి దూసుకు వెళ్లింది. ఈ ఘటనలో విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం తెలుసుకున్న ఆగిరిపల్లి ఎస్ఐ కె. శుభశేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని జరిగిన ప్రమాదాన్ని పరిశీలించి, స్కూల్ బస్ డ్రైవర్‌కు పలు సూచనలు తెలియజేశారు.

నీళ్లతో మద్యం కల్తీ

▸ బ్రాండ్ మార్చి ఇతర బ్రాందీ సీసాల్లో నింపి బెల్ట్ షాపులకు అమ్ముతున్న అన్నదమ్ముల అరెస్ట్
▸ 180 ఎంఎల్ మద్యం క్వార్టర్ బాటిల్‌లో 40 ఎంఎల్ నీళ్లు
▸ 219 మద్యం సీసాలు, 19,500 నకిలీ కంపెనీ సీసా మూతలు, 622 ఖాళీ క్వార్టర్ బాటిళ్ల స్వాధీనం ▸ అమాయకులను మోసగిస్తున్న వైనం

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకు దొరికే మద్యాన్ని తాగే పేద, మధ్య తరగతికి చెందిన మందు బాబులను మోసం చేస్తూ నీళ్ల కలిపిన మద్యం, బ్రాండ్ మార్చిన మద్యాన్ని ఒరిజినల్ మద్యం మాదిరిగా బెల్ట్ షాపుల వద్ద అమ్ముతున్న ఇద్దరు అన్నదమ్ములను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ స్టేషన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంటెంట్ సీహెచ్. అజయ్‌కుమార్ సింగ్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బోయపాటి శ్రీలత, అసిస్టెంట్ కమిషనర్ కేవీఎస్. ప్రభుకుమార్ ఆదేశాలతో దాడులు నిర్వహించినట్టు తెలిపారు. కల్తీ చేసిన మద్యాన్ని ద్విచక్ర వాహనంపై తరలిస్తున్నారని వచ్చిన సమాచారంతో జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెం గ్రామం సమీపంలో మంగళవారం ఉదయం దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడిలో మండలంలోని వేగవరం గ్రామానికి చెందిన నూతి మధు ద్విచక్ర వాహనంపై మద్యం తరలిస్తూ ఉండగా అరెస్టు చేశామన్నారు. అతడిని విచారించిన అనంతరం వేగవరంలోని అతడి ఇంటివద్ద దాడులు నిర్వహించామన్నారు. అక్కడ అతడి తమ్ముడు నూతి సాయిరాంతో పాటు మద్యం సీసాలు, మద్యం కల్తీ చేయడానికి ఉపయోగించే ఖాళీ సీసాలు, మూతలు, తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు.





కల్తీకి ఉపయోగించిన మద్యం బాటిళ్లు 99 బ్రాండ్, ఓఏబీ బ్రాండ్

నిందితులు, మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ శాఖ అధికారులు

రెండు రకాల మద్యం బాటిళ్ల ధరలు ఇలా..

మద్యం దుకాణాలు లేని గ్రామాల్లో బెల్ట్ షాపుల వద్ద రూ.99 ధర ఉన్న '99' బ్రాండ్ మద్యాన్ని నూట ఇరవై రూపాయలకు, ఇదే 99 బ్రాండ్ మద్యంతో ఓఏబీ క్వార్టర్ బాటిళ్లలో నింపిన బాటిళ్లను రూ.150కు అమ్ముతున్నారు. మద్యం దుకాణాల్లో ఓఏబీ క్వార్టర్ ధర రూ.130. ఈ రెండు బ్రాండ్ లు రాడికో కంపెనీ తయారు చేసినవే కావడంతో పెద్దగా తేడా తెలియవని నిందితులు ఈ బ్రాండ్‌లు ఎంచుకున్నట్టు తెలిపారు. వీరిద్దరితో పాటు రాడికో కంపెనీ లేబిల్‌ను బాటిల్ మూతలపై ముద్రించి అక్రమానికి పాల్పడిన విజయవాడ వన్‌టౌన్‌కు చెందిన ముత్తా మనోజ్‌కుమార్ అనే గుజరాత్‌కు చెందిన వ్యాపారిపై కేసులు నమోదు చేశామని తెలిపారు.

● నిందితులైన మధు, సాయిరాం తండ్రి రామకృష్ణపై గతంలో నాటు సారా కేసులు న్నాయని తెలిపారు. మూతలు సప్లై చేసిన వ్యాపారి ముత్తా మనోజ్‌కుమార్‌పై కూడా గతంలో నరసాపురంలో నకిలీ మూతల సరఫరా చేసినందుకు కేసులున్నట్టు తెలిపారు. ఈ దాడిలో నిందితుల నుంచి 219 మద్యం సీసాలు, 19,500 ఓఏబీ బ్రాండ్‌తో ఉన్న బాటిల్ మూతలు, 622 ఖాళీ ఓఏబీ క్వార్టర్ బాటిల్స్ 370 తీసివేసిన బాటిల్ మూతలు, ఒక స్కూటీ వాహనం, బాటిళ్లకు సీల్ వేసే బొంత సూది స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో స్థానిక ఎక్సైజ్ స్టేషన్ సీఐ కె.శ్రీనుబాబు, ఎన్‌ఫోర్స్ మెంట్ సీఐ వైవీఎస్ఎస్. ఫణికు మార్, స్టేషన్ ఎస్ఐ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

కల్తీ చేసిన విధానం ఇలా..

వేగవరం గ్రామానికి చెందిన నూతి మధుకు గతంలో బ్రాందీ షాపులో పనిచేసిన అనుభవం ఉంది. ఆ అనుభవంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు సంపా దించాలని, తమ్ముడు నూతి సాయిరాం సహకారంతో మద్యం దుకాణాల వద్ద '99' అనే బ్రాండ్‌కు చెందిన మద్యం క్వార్టర్ బాటిళ్లను అధిక మొత్తంలో కొనుగోలు చేసేవారు. 180 ఎంఎల్ మద్యంతో ఉన్న క్వార్టర్ బాటిల్‌లో సుమారు 40 ఎంఎల్ మద్యాన్ని ఒక పాత్రలోకి వేరు చేస్తారు. ఆ తరువాత ఖాళీ చేసిన మద్యం స్థానంలో నీళ్లతో నింపి వారి దగ్గర ఉన్న బొంత సూదితో అనుమానం రాకుండా తిరిగి సీల్ చేస్తారు. ఆ తర్వాత ఇతర దుకాణాలలో సేకరించిన ఓల్డ్ అడ్మిరల్ బ్రాందీ (ఓఏబీ) ఖాళీ క్వార్టర్ బాటిళ్లలో 99 బ్రాండ్ క్వార్టర్ బాటిళ్ల నుంచి వేరు చేసిన మద్యాన్ని నింపి విజయవాడ నుంచి తెప్పించిన నకిలీ క్వార్టర్ బాటిళ్ల మూతలతో సీల్ చేస్తారు. ఈ రెండు రకాల మద్యం బాటిళ్లను మద్యం దుకాణాలు లేని గ్రామాల్లో అక్రమ మద్యం వ్యాపారం చేసే వారికి, పలు బెల్ట్‌షాపుల వద్ద అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

క్రైం సమాచారం

వేర్వేరు చోట్ల ఆరుగురి మృతి

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో మంగళవారం వేర్వేరు చోట్ల మొత్తం ఆరుగురు మృతి చెందారు. ఏలూరు జిల్లాలో రైలు ఢీకొని మహిళ, చికిత్స పొందుతూ మరో మహిళ, అప్పు చెల్లించలేక ఒకరు, పామాయిల్ గెలలు కోస్తూ మరొకరు మృతి చెందారు. పశ్చిమ గోదావరి జిల్లాలో రోడ్డు ప్రమాదంలో యువకుడు, కారు ఢీకొని మరొకరు మృతి చెందారు.

రైలు ఢీకొని మహిళ మృతి



లక్ష్మి (ఫైల్)

ఏలూరు క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఒక మహిళ రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కృష్ణా జిల్లా పొట్టిపాడు గ్రామానికి చెందిన చిక్కవరపు లక్ష్మి(30)కి ఆరేళ్ల క్రితం వివాహమైంది. విడాకులు తీసుకుంది. 2010వ సంవత్సరం నుంచి మానసికంగా ఇబ్బందులకు గురికావడంతో విజయవాడలోని ఒక ఆసుపత్రిలో వైద్యం చేయిస్తున్నారు. ఆమె తన కుటుంబ సభ్యులకు మంగళవారం కాలేజీలో పనిఉందని ఇంట్లో చెప్పి వెళ్తుండగా పొట్టిపాడు రైల్వేస్టేషన్ వద్ద రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె అక్కిడికక్కడే మృతి చెందింది. ఈ సమాచారం ఏలూరు రైల్వే పోలీసులకు అందడంతో రైల్వే ఎస్ఐ కె. శివన్నారాయణ ఆధ్వర్యంలో హెడ్‌కానిస్టేబుల్ పి.శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కలిదిండి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి గ్రామానికి చెందిన ముత్యాల హేమ(28)కి కలిదిండి మండలం సంతోషపురం గ్రామానికి చెందిన చిట్టిబాబుతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. భర్త మద్యానికి బానిసై కుటుంబ పోషణ పట్టించు కోకుండా ఆమెను శారీరకంగా, మానసికంగా హింసిస్తుండచింతో మనస్తాపానికి గురై ఈనెల 8న గడ్డి మందు తాగింది. ఆమెను కలిదిండి, భీమవరం ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి వైద్యం చేయించారు. అప్పటి నుంచి ఆమెకు తరచూ కడుపు నొప్పి వస్తోంది. సోమవారం తీవ్రంగా కడుపునొప్పి రావడంతో మచిలీపట్నం ప్రభు త్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తండ్రి చింతపల్లి రాజు ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శుభకార్యం ఇంట పెను విషాదం

▸ రెండు బైక్‌లు ఢీ.. యువకుడి దుర్మరణం మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



సందీప్ (ఫైల్)

ఆచంట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): చిన్నాన్న కుమార్తె పుష్పవతి ఫంక్షన్ నిర్వహించిన కుటుంబంలో పెనువిషాదం నింపింది. అప్పటివరకు బంధువులు, కుటుంబ సభ్యులతో ఎంతో ఆనందంగా ఆడుతూ పాడుతూ గడిపిన యువకుడు మోటారు సైకిల్‌పై బయటకు వెళ్లి తిరిగి రాని లోకానికి వెళ్లిన విషాద ఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఆచంట పంచాయతీ పరిధిలో చాలెంజర్స్ కాలనీ సమీపంలో కిరాణా కొట్టు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న నక్క సూరిబాబు, రత్నకుమారికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు సందీప్(19) పదో తరగతి చదువుకుని తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. అదే గ్రామంలో చిన్నాన్న కుమార్తె పుష్పవతి ఫంక్షన్ పూర్తయిన తరువాత సోమవారం రాత్రి తన తల్లి దగ్గర రూ.200 తీసుకుని స్నేహితుడు మంచుగంటి దొరబాబుతో కలిసి బయటకు వెళ్లి వస్తానని చెప్పాడు. బైక్‌పై మార్టేరు - ఆచంట ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఇంటికి వస్తుండగా మరో మోటారుసైకిల్‌ను అతి వేగంగా ఢీకొట్టడంతో సందీప్ అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై వెనుక కూర్చున్న మంచుగంటి దొరబాబుకు రెండు కాళ్లు విరిగిపోవడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్టు బంధువులు తెలిపారు. మరో వాహన చోదకుడు పాలకొల్లుకు చెందిన రమేష్ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందున్నాడు.

అప్పు చెల్లించలేక వ్యక్తి ఆత్మహత్య



సతీశ్ మృతదేహం

ఏలూరు క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఓ బ్యాంకులో తీసుకున్న అప్పు చెల్లించలేక జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు శ్రీరామ్‌నగర్ 12వ రోడ్డుకు చెందిన బోను సతీష్(35) భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఒక సూపర్ బజార్‌లో గుమస్తాగా పనిచేస్తున్నాడు. తన కుటుంబ అవసరాల నిమిత్తం ఒక బ్యాంకులో అప్పు తీసుకున్నాడు. అప్పు తీర్చేమార్గం కానరాక జీవితంపై విరక్తి చెంది మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని ఉరి నుంచి దించి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందాడని నిర్ధారించారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

పామాయిల్ గెలలు కోస్తూ ఒకరి మృతి



అంజయ్య మృతదేహం

టి.నరసాపురం,ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పామా యిల్ గెలలు కోస్తూ విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం టి.నరసాపురం మండలంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి.. బొర్రంపాలెం గ్రామానికి చెందిన దోమతోటి అంజయ్య(39)కు వివాహమైంది. ప్రతిరోజు పామాయిల్ గెలలు కోసే పనికి వెళ్తుంటాడు. ఈ నేపథ్యంలో మంగళవారం గ్రామ శివారుల్లో గల రైతు పొలంలోకి పామాయిల్ గెలలు కోయడానికి వెళ్లిన కొద్దిసేపటికి అల్యూమినియం గెడ కత్తి పక్కనే ఉన్న కరెంట్ తీగకు తగలడంతో షాక్ తగాఇలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని అతడి భార్య, కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తెలుపగా వారి వచ్చేసరికి మృతి చెంది ఉన్నారు. ఈ మేరకు భార్య స్వర్ణకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు.

కారు ఢీకొని మోటారు సైక్లిస్టు మృతి

ఉండి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి):కారు ఢీకొట్టిన ప్రమాదంలో మోటారుసైక్లిస్టు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందగా మరో ఐదుగురు గాయాలైన ఘటన ఉండి మండలం కలిసిపూడిలో సోమవారం రాత్రి జరిగింది. ఉండి పోలీసులు మంగళవారం తెలిపిన వివరాలివి.. ఆకివీడులోని తాళ్లకోడు ప్రాంతానికి చెందిన అంగర శ్రీను(46) అతడి కుమార్తె మోటారు సైకిల్‌పై భీమవరం వెళ్లి తిరిగి వస్తుండగా కలిసిపూడి వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంగర శ్రీను తీవ్రగాయాపాలై భీమవరంలోని ఆసుపత్రిలో సోమవారం రాత్రి మృతి చెందాడు. అతడి కుమార్తెతో పాటు కారులో వున్న మరో నలుగురు స్వల్ప గాయాలతో ఆసుపత్రిలో చేరారని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నజీరుల్లా తెలిపారు.

వేగవరం బైపాస్ రోడ్డుపై మూడు లారీలు ఢీ



రోడ్డు ప్రమాదంలో నిలిచి ఉన్న లారీలు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలం వేగవరంలో బైపాస్ రోడ్డుపై ఉన్న స్పీడు బ్రేకర్ వద్ద ఓ లారీ డ్రైవరు హఠాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న మరో రెండు లారీలు ఒకదాన్ని మరొకటి ఢీ కొట్టిన ఘటన మంగళవారం ఉదయం జరిగింది. ఈ ఘటనలో మూడు లారీలు దెబ్బతిన్నాయి. మధ్యలో వున్న లారీ డ్రైవర్‌కు స్వల్పగాయాలు మినహా పెద్ద ప్రమాదం లేదు. ఎస్ఐ ఎస్‌కే జబీర్ స్పందించి పోలీసు సిబ్బందితో రోడ్డుపై నిలిచిన లారీలను పక్కకు తీయించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. ఇటువంటి ఘటనలు ప్రతి రోజూ జరుగుతున్నాయని తమ ప్రాణాలు ఎప్పుడు పోతాయోనని భయంగా ఉందని వేగవరం ప్రజలు వాపోతున్నారు. బైపాస్ రోడ్డుకు ఇరువైపులా ఇళ్లు ఉండడంతో రోడ్డు దాటడానికి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు రోడ్డుపై స్పీడు బ్రేకర్లు నిర్మించారు.కానీ స్పీడు బ్రేకర్లు ఉన్నట్లు ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో లారీలు అతివేగంగా వచ్చి హఠాత్తుగా బ్రేక్‌లు వేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఉన్నట్లు బోర్డులు ఏర్పాటు చేయాలని వేగవరం ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి కోర్టు ఉద్యోగాలకు పరీక్షలు : జిల్లా జడ్జి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీదేవి

ఏలూరు క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని కోర్టులలో పలు పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు పరీక్షల నిర్వహిస్తామని జిల్లా జడ్జి ఎస్.శ్రీదేవి తెలిపారు. జిల్లా జడ్జి చాంబర్‌లో మంగళవారం పరీక్షల నిర్వహణ వివరాలు విలేకరుల సమావేశంలో ఆమె తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు కోర్టులలో స్టెనోగ్రాఫర్స్, టైపిస్ట్, కాపీయిస్ట్, డ్రైవర్ తదితర పోస్టులకు జారీ చేసిన నోటిఫికేష్‌కు 4,207 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని, వీరికి ఈనెల 20 నుంచి 24 వరకు మూడు కేంద్రాలలో అనగా ఏలూరులోని సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ, సిద్దార్థ క్వెస్ట్ కళాశాల, భీమవరంలోని డీఎన్ఆర్ కళాశాల కేంద్రాలలో పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్ష ఆన్లైన్ విధానంలోనే ఉంటుందని, ఈనెల 20, 21, 22, 24 తేదీల్లో జరిగే నాలుగు రోజులపాటు మూడు షిఫ్టుల్లో, 23వ తేదీన రెండు షిఫ్టులలో పరీక్ష నిర్వహిస్తామన్నారు. స్టెనో గ్రాఫర్ గ్రేడ్-3, టైపిస్ట్, కాపీయిస్ట్, డ్రైవర్ పోస్టులకు కంప్యూటర్ పరీక్షలతో పాటు నైపుణ్యం పరీక్షలు ఉంటాయన్నారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్‌లతో పాటు ఫొటోగుర్తింపు కార్డులు తీసుకురావాలని, పరీక్ష సమయానికి 15 నిమిషాల ముందు వరకు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు పరీక్షలకు హాజరయ్యే విభిన్న ప్రతిభావంతులకు వారి విజ్ఞప్తి మేరకు స్క్రైబ్‌ని ఏర్పాటు చేస్తామన్నారు. వారిని నిర్దేశించిన సమయం కంటే 30 నిమిషాలు అదనపు సమయం ఇవ్వడం జరుగుతుందన్నారు. హాల్‌టిక్కెట్ డౌన్లోడ్‌లో సాంకేతిక సమస్యలు, తదితర సమస్యల పరిష్కారం కోసం అభ్యర్థుల కోసం 0863-2372752 నంబరుతో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామన్నారు.helpdesk.hc.ap.aij.gov.in మెయిల్‌కి తెలియజేయాలన్నారు. పరీక్షల నిర్వహణకు, సాంకేతిక సమస్యల పరిష్కారానికి ప్రతి పరీక్షా కేంద్రానికి ప్రత్యేక అధికారిని, సాంకేతిక సిబ్బందిని నియమించా మన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖ అధికారులను, విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను ఆదేశించామన్నారు. పరీక్షల కేంద్రాలకు అవసరమైన రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించామన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆయిల్ పామ్ కార్మికులు

ఆయిల్‌పామ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు రూరల్,ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పామాయిల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సంఘడుఉ పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయిల్‌పామ్ కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం పామాయిల్ కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పదివేల మందికిపైగా ఆయిల్‌పామ్ కార్మికులు పామాయిల్ తోటలో పనిచేస్తున్నారన్నారు. తోటల్లో పనిచేస్తున్న సమయంలో గెలలు కోయడం, లోడ్ చేయడం, ఫ్యాక్టరీల వద్ద అన్లోడ్ చేయడం వంటి పనులు చేస్తున్న కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. విద్యుత్ షాక్ తగిలి, విషపురుగులు కాటేసి చనిపోవడం, దివ్యాంగులుగా మారుతున్నా రన్నారు. విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంతో ఆయిల్ పామ్ కార్మికులు జిల్లాలో విద్యుత్ షాక్ తగిలి పిట్టల్లా రాలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పామాయిల్ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం.సత్యనారాయణ, హరీష్, ఎం.లక్ష్మణ, ఎం.రాంబాబు, టి.సుబ్బారావు, జి.రమేష్, ఎం.శ్రీను, అర్జున, జి.యేసురాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం..

▸ మహిళ నుంచి రూ.9.80 లక్షలు స్వాహా

భీమవరం క్రైం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తనకు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఓ వ్యక్తి మోసం చేయడమే కాకుండా ఇంటికి సంబంధించిన దస్తావేజులు తీసుకుని ముఖం చాటేశాడంటూ ఓ మహిళ టూటౌన్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. టూటౌన్ ఎస్ఐ రెహ్మాన్ తెలిపిన వివరాలివి.. చెట్టు కింద సాయిబాబా ఆలయం వద్ద నివాసం ఉండే ఉందుర్తి రాణి ఐదేళ్ల క్రితం భర్త నుంచి వేరుపడి విడాకులు పొందింది. ప్రస్తుతం ఆమె ఒక హాస్పిటల్‌లో నర్సుగా పనిచేస్తుంది. అక్కడే పని చేస్తున్న ప్రసాదరాజు అనే వ్యక్తి ఆమెకు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని కొంతకాలం క్రితం నమ్మించాడు. అతడి మాటలు నమ్మి రెండు విడతల్లో రూ. 9 లక్షల 80 వేలు ఇచ్చింది. అంతేకాక ఇల్లు కట్టిస్తానని చెప్పి ఆమె ఇంటికి సంబంధించిన దస్తావేజులు తీసుకున్నాడు. అయితే ఉద్యోగం ఇప్పించకుండా తన వద్ద డబ్బులు తీసుకున్నాడని ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బెదిరించిన నలుగురు విలేకరులపై కేసు

తాడేపల్లిగూడెం రూరల్,ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లిలో ఓ వ్యభిచార గృహం వద్దకు వెళ్లి పోలీసులమంటూ బెదిరించి డబ్బులు వసూలు చేయడంతోపాటు మహిళల పట్ల అసభ్యంగా వ్యవహరించిన ఫిర్యాదుపై తాడేపల్లిగూడెం విలేకరులపై కేసు నమోదు చేశామని సీఐ రవికుమార్ మంగళవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లిలో వ్యభిచార గృహం నిర్వహిస్తున్న వారి వద్ద జూలై 9న తాడేపల్లిగూడెంకు చెందిన నలుగురు విలేకరులు రాజశేఖర్, కళ్యాణ్, ప్రకాశ్, మహేశ్ తాము పోలీసులమంటూ వెళ్లి డబ్బులు డిమాండ్ చేశారు. డబ్బులు తీసుకోవడమే కాకుండా అక్కడ మహిళల పట్ల అసభ్యంగా వ్యవహరించారనే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

ముగ్గురు దారి దోపిడీ దొంగల అరెస్ట్

▸ రూ.3.15 లక్షల విలువైన సొత్తు రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కారులో వచ్చి బస్సు చార్జీకే మీరు వెళ్లే చోటకు తీసుకెళతామని చెప్పి ప్రయాణికుడిని బెదిరించి దోపిడీ చేసిన ముఠాను మంగళవారం అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.3.15 లక్షల సొత్తు రికవరీ చేశామని తాడేపల్లిగూడెం పోలీసులు తెలిపారు. పెంటపాడు బీసీ కాలనీకి చెందిన కోట జగదీష్, తణుకు మండలం ముద్దాపురానికి చెందిన యల్లా సంతోష్, గణపవరం మండలం మొయ్యేరుకు చెందిన అంద్రు హర్షకుమార్ జల్సాలకు అలవాటు పడి దారి దోపిడీలకు పాల్పడుతున్నారన్నారు. ఈనెల 5వ తేదీన తాడేపల్లిగూడెంలో ఏలూరు బస్టాండ్ రోడ్డు వద్ద తాడేపల్లిగూడెంకు చెందిన మేడా సుబ్రహ్మణ్య శర్మ ఏలూరు బస్సు ఎక్కేందుకు నిలిచిఉండగా ఒక కారు వచ్చి 'మేం ఏలూరు కిరాయికి వెళ్తున్నాం.. బస్సు చార్జి ఇవ్వండి దింపేస్తాం' అంటూ ఆయనను కారులో ఎక్కించుకున్నారు. అక్కడ నుంచి కొంత దూరం వెళ్లాక నిర్మానుష్య ప్రాంతంలో కారు ఆపి.. చాకుతో బెదిరించి అతడి వద్ద నుంచి రూ.3,500 నగదు, లాకెట్‌తో కూడిన బంగారం చైన్, మూడు బంగారపు ఉంగరాలు చోరీ చేశారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ ఆదిప్రసాద్, ఎస్ఐలు నాగ రాజు, బాదం శ్రీను సిబ్బంది దర్యాప్తు చేపట్టి నిందితులను పట్టుకుని వారి నుంచి రూ.3.15 లక్షల విలువ చేసే చోరీ సొత్తుతోపాటు కారు, చాకును స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు వేగంగా పూర్తి చేసి నిందితులను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, డీఎస్పీ విశ్వనాథ్ అభినందించారు.

ఘనంగా ఏకాదశి పూజలు

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శ్రావణ మంగళవారం ఏకాదశి పర్వదినం కావడంతో తూర్పువీధిలోని రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో మంగళవారం నగర మేయర్ షేక్ నూర్జహాన్, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు స్వామికి, మహాలక్ష్మి అమ్మవారికి పంచామృత క్షీరాభిషేకం నిర్వహించి అనంతరం సుదర్శన హోమం జరిపారు. ఆలయ అర్చక బృందం మేయర్ దంపతుల పూజ అనంతరం ఆశీర్వచనలు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉంగుటూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నారాయణపురం సబ్ స్టేషన్ నుంచి నిడమర్రు సబ్ స్టేషన్ వరకు మరమ్మతుల నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు నారాయణపురం సబ్ స్టేషన్ పరిధిలోని బాదంపూడి రూరల్ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ శాఖాధికారి అంబేడ్కర్ తెలిపారు. రావులపర్రు, రాచూరు, సీతారాంపురం గ్రామాల చేపల చెరువులకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి

టి.నర్సాపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈ నెల 20 నుంచి జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏలూరు జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు కారం దారయ్య పిలుపునిచ్చారు. మక్కినవారిగూడెం గ్రామంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దారయ్య మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలన్నారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు సాగర్ మాట్లాడుతూ ఒంగోలుకు మండలం నుంచి విస్తృత స్థాయిలో ప్రజలు సమీకరించాలని పిలుపునిచ్చారు. మండల కార్యదర్శి కొండముచ్చు శ్రీనివాసరావు, తాడిగడప జయరాజు, మల్లెల సత్యనారాయణ, కాళహస్తి సుబ్బారావు, కృష్ణారావు పాల్గొన్నారు.

గణపతి ఉత్సవాలపై పోలీసుల దిశానిర్దేశం

భీమడోలు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): సర్కిల్ పరిధిలోని భీమడోలు, ద్వారకాతిరుమల మండలాల్లో నిర్వహించే గణపతి ఉత్సవాలు పోలీసుల నిబంధనల మేరకే నిర్వహించాలని భీమడోలు సీఐ యు.జె.విల్సన్ తెలిపారు. ఉత్సవ నిర్వాహకులు కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పబ్లిక్, ప్రైవేటు స్థలాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. మైకులు, డీజే సౌండ్‌లకు అనుమతులుండాలని రాత్రి 10 గంటల తర్వాత ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. అల్లర్లు, ఘర్షణలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు.

నేడు జంగారెడ్డిగూడెంలో జాబ్ మేళా

చింతలపూడి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.జితేంద్రబాబు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 13 కంపెనీలు పాల్గొంటాయని, సుమారు 877 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ విద్యార్హతలు ఉండి 18-30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని మేళాకు వచ్చే సమయంలో అభ్యర్థులు బయోడేటా, సర్టిఫికెట్ల నకళ్ళతో రావాలని తెలిపారు. జాబ్‌మేళా జంగారెడ్డిగూడెం టౌన్ హాల్లో జరుగుతుందని తెలిపారు.

తపాలా ఉపకారవేతనాల పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ దీనదయాళ్ స్పర్శ్ యోజన ఉపకార వేతనాలు పొందేందుకు నిర్వహించే పరీక్షకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఏలూరు డివిజన్ పోస్టాఫీసుల సూపరింటెండెంట్ శ్రీకర్‌బాబు తెలిపారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతూ, ఫిలాటెలి అకౌంట్ లేదా సంబంధిత స్కూల్ ఫిలాటెలి క్లబ్ సభ్యత్వం ఉన్న విద్యార్థులు పరీక్షకు అర్హులని, దరఖాస్తులను సెప్టెంబరు 16లోగా తమ కార్యాలయానికి లేదా పోస్ట్‌మన్ ద్వారా పంపాలన్నారు.పరీక్ష మల్టీపుల్ ఛాయిస్ విధానంలో సెప్టెంబరు 30న జరుగుతుందన్నారు. దరఖాస్తు ఫార్మెట్‌ను డివిజన్ పరిధిలోని అన్ని పాఠశాలలకు మార్కెటింగ్ ఏజంట్ల ద్వారా ఇప్పటికే పంపించామన్నారు. రెండు స్థాయిల్లో నిర్వహించే పరీక్షలో విజేతలను ఒక్కో తరగతి నుంచి పదిమంది చొప్పున మొత్తం 40 మందిని రాష్ట్రస్థాయిలో ప్రతిభ ఆధారంగా ఎంపికచేసి ఒక్కొక్కరికి ప్రతీ మూడు నెలలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.6 వేలు ఉపకార వేతనంగా విద్యార్థి సేవింగ్స్ ఖాతాకు జమచేస్తారని వివరించారు.

ఓట్ల దొంగలను తరమికొట్టాలి : కాంగ్రెస్

దెందులూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): దేశంలో ఓట్ల దొంగలను తరిమికొట్టి ప్రజాస్వామ్యయుత ప్రభుత్వాన్ని గద్దెనెక్కించే రోజులు రావాలని దెందులూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఆలపాటి నర్సింహమూర్తి అభిప్రాయపడ్డారు. పెదవేగి మండలం మొండూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జాతీయస్థాయిలో పార్టీల్లో నీతి, నిజాయితీలు దిగజారాయని, దానికి నిదర్శనమే బీహార్‌ల్లో వెలుగు చూసిన దొంగ ఓట్ల భాగోతమన్నారు. రాబోయే కాలంలో ప్రజలకు సుస్థిర పాలన అందించడానికి కాంగ్రెస్‌ను అధికారంలో తీసుకురావడానికి ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని ఆలపాటి పిలుపునిచ్చారు. పార్టీ మండలాధ్యక్షులు నేతల సుబ్బారావు, రాధాకృష్ణ, యోహాన్, రంభా కిషోర్, ఆలపాటి వెంకట చౌదరీలు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు నిధులివ్వండి

చింతలపూడి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): చింతలపూడి నియోజకవర్గంలో అనేక గిరిజన గ్రామాలు ఉన్నాయని, వాటి అభివృద్ధికి నిధులు కేటాయించాలని గిరిజన ముఖ్య కార్యదర్శి మల్లికార్జున్ నాయక్‌ను స్థానిక ఎమ్మెల్యే రోషన్ కుమార్ కలిసి విజ్ఞాపన అందించారు. పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.యువరాజును కలిసి చింతలపూడి మండలం పట్టాయిగూడెంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేశారని, ఇక్కడ పరిశ్రమలు పెట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలని, దీని వల్ల నియోజకవర్గంలో నిరుద్యోగులకు, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని కోరారు.

నేత్రపర్వంగా శివకల్యాణం



ద్వారకాతిరుమల, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతున్న శివదేవుని ఆలయంలో స్వామివారి కల్యాణం మంగళ వారం నేత్రపర్వంగా జరిగింది. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని లోకకల్యాణార్థం జరిగిన ఈ కల్యాణ తంతు భక్తులను అలరించింది. శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయ మైన ఈ ఆలయ ముఖమండపంలో ఏర్పాటు చేసిన వేదికపై గంగా, పార్వతీ సమేత శివయ్య కల్యాణ మూర్తులను ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం కల్యాణతంతును ప్రారంభించారు. శుభముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర బెల్లం ధరింపచేసి మాంగల్య ధారణ, తలంబ్రాలు మేళతాళాల నడుమ ఘనంగా నిర్వహించారు.

నేడు హజరత్ సయ్యద్ జమాల్ షా ఉరుసు

ఏలూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శనివారపుపేట ఆర్‌లైన్‌లో హజరత్ సయ్యద్ జమాల్ షా వలి దర్గా ఉరుసు మహోత్సవాన్ని బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించనున్నట్టు వంశపారంపర్య ముజావర్లు ఎండీ అమీర్‌జాన్, జాఫర్ షరీఫ్‌లు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు మేళతాళాలతో మహాత్ముల వారి గంధం ఊరేగింపు చేపట్టి, అనంతరం ఫాతేహా ఖాని జరుగుతుందన్నారు. 21న ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు బంగర్ ఖానీ(అన్నదానం), సాయంత్రం 6 గంటలకు దీపారాధనతో ఉరుసు ముగుస్తుందన్నారు. ఈ ఉరుసులో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ముజావర్లు కోరారు.

అంబికాదేవి ఆలయంలో పూజలు

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): సత్రంపాడులోని అంబికాదేవి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని వీరాంజనేయస్వామి ఆలయం వద్ద నగరానికి చెందిన ఫణీంద్ర మిత్రబృందం స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి అనంతరం భగవద్గీత పారాయణ నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు భక్తులతో పూజలు చేయించారు. ఆలయ మేనేజర్ ఓగిరాల మల్లికార్జునరావు భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

మార్పుకే..మచ్చ!

(5వ పేజీ తరువాయి)

ప్రతీ సోమవారం రైతులు, సాధారణ పౌరులు తమ సమస్యలను ఏకరువు పెడుతూనే ఉన్నారు. కాని ఫలితం మాత్రం లేదు. ఎమ్మెల్యేలు కలుగ చేసుకుని ప్రస్తావించాల్సి వస్తోంది. ఎరువులు, పురుగుల మందుల జారీకి వచ్చే ఆటంకాలను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌లాంటివారు లేవనెత్తాల్సిన పరిస్థితి వచ్చింది. జిల్లాలో ఎమ్మెల్యేలు, ఎంపీలు అందరూ అధికార పక్షానికి చెందినవారే. కీలక సమావేశాల్లో యంత్రాంగం వైఫల్యం మీద లేదా చేతకానితనం మీద మాట్లాడితే అది ప్రభుత్వ ప్రతిష్టకు మచ్చ. అందుకనే ఉన్న సమస్యపై బహిరంగంగా మాట్లాడలేక.. సక్రమంగా స్పందించని అధికారులపై విరుచుకుపడలేక ఎమ్మెల్యేలంతా నిస్సహాయతలో పడ్డారు. కాని అధికారంలో ఉండి తామేమీ చేయలేకపోతున్నామన్న భావన ప్రజల్లో ముదిరితే అది తమ చేతకానితనం అవుతుందేమోనని కొందరు ఎమ్మెల్యేలు ఆందోళనలో ఉన్నారు. ప్రత్యేకించి ప్రభుత్వపరంగా కొన్నింటిని ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యేలు సిద్ధమైనా అధికారులు తదనుగుణంగా స్పందించని ఘటనలు చాలానే ఉన్నాయి. శాఖల వారీగా సమీక్షలు జరుగుతున్నప్పుడు కేవలం అంకెల ప్రస్తావనతో సరిపెట్టకుండా పనితీరు ప్రామాణికంగా సమీక్షిస్తే తప్ప కొన్ని శాఖలు బాగుపడే పరిస్థితిలేదని భావిస్తున్నారు. ఇన్‌చార్జిమంత్రి మనోహర్ సైతం ఎమ్మెల్యేలు లేవనెత్తుతున్న సమస్యలను ప్రస్తావిస్తూ.. మనం ప్రత్యేకంగా భేటీ అయ్యి మాట్లాడుకుందామని నచ్చచెపాల్సి వస్తుంది.

హైవే నిర్మాణ పనులు వేగవంతం

జీలుగుమిల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జీలుగు మిల్లి నుంచి పట్టిసీమ వరకు నిర్మించే హైవే రహ దారి(365 బీబీ) పనులు ఊపందుకున్నాయి. ఇటీ వల గ్రామంలో నాలుగు రోడ్ల కూడలి నుంచి పోల వరం వైపు వేళ్లే రహదారి విస్తరణ పనులు ప్రారం భించారు. ఇప్పటికే ఆర్‌అండ్‌బీ ఇతర భూములు కల్గిన దుకాణ దారులు నష్టపోకుండా ప్రభుత్వం రెవెన్యూ అధికారుల ద్వారా గుర్తించిన లబ్ధిదారులకు కొంత నష్టపరిహారం చెల్లించారు. మరో వైపు ఆర్ అండ్‌బీలో నివాసాలు పలు వ్యాపార దుకాణదారుల్ని ఖాళీ చేయించారు. జీలుగుమిల్లి, బర్రింకలపాడు, పి.అంకంపాలెం వరకు రహదారికి ఇరు వైపులా హైవే రోడ్డు నిర్మాణం పనులకు ఆటంకం లేకుండా కాళీ చేయించారు. చెట్లను తొలగించారు. బర్రింకలపాడు సమీపంలో పల్లపు ప్రాంతంలో రెండు చోట్ల, అటవీ నుంచి వరద వచ్చే ప్రాంతంలో మరో చోట కల్వ ర్టుల నిర్మాణానికి ముందుగా పెద్ద తూరల్ని ఏర్పాటు చేస్తున్నారు. వాటిని క్రైన్‌ల సాయంతో అమరుస్తున్నారు. మరోవైపు జీలుగుమిల్లి సెంటరులోని శ్రీవ ల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో విగ్రహాల్ని ప్రస్తుతం శ్రీకోదండ రామాలయంలో ఉంచి పూజలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం రోడ్డు విస్తరణలో జగదాంబ ఆలయం తొలగించేందుకు ఎండో మెంట్ అధికారులకు ఆలయ పునర్నిర్మాణానికి కొంత నగదు నష్టపరిహారంగా ప్రభుత్వం చెల్లించింది. అయితే ఆలయం ఎక్కడ నిర్మిస్తారనే విషయం మండల ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. చింతలపూడి రోడ్డు వైపు విస్తరణలో భాగంగా గుర్తించిన మరికొంత మందికి ప్రభుత్వం నుంచి పరిహారం అందాల్సి ఉంది.



కల్వర్టుల నిర్మాణం చేపడుతున్న కార్మికులు

రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి



ఎరువులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

దెందులూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వరి రైతులకు ఇబ్బందులు లేకుండా వ్యవసాయ శాఖ అధికారులు యూరియాను అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం దెందులూరు నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలో పలువురు తమ సమస్యలపై చింతమనేనికి వినతులు అందించారు.

సొసైటీల్లో ఎరువుల తనిఖీలు..

పెదపాడు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఎటువంటి అవకతవకలు లేకుండా రైతులకు ఎరువులు అందించాలని వ్యవసాయశాఖ ఏడీఏ అనీల్‌కుమారి తెలిపారు. పెదపాడులోని సొసైటీ, ప్రైవేటు ఎరువుల దుకాణాలను మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గతంలో రైతులకు పంపిణీ చేసిన ఎరువుల వివరాలను, ప్రస్తుత స్టాకు వివరాలు తనిఖీ చేశారు. తహసీల్దారు కృష్ణజ్యోతి, ఏవో షేక్ ఇమామీ ఖాసీం, బొప్పూడి కాశీబాబు పాల్గొన్నారు.

ఎరువుల గోదాముల్లో తనిఖీలు..

పోలవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం గోదాములను మండల అధికారుల బృందం మంగళవారం తనిఖీలు నిర్వహించింది. తహసీల్దారు బి.సాయిరాజు, మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు సొసైటీ గోదాములను యూరియా నిల్వలను తనిఖీ చేశారు. ఐదు సొసైటీల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు వినియోగించుకోవాలన్నారు. సొసైటీ అధ్యక్షులు కొణతాల ప్రసాద్, ఎదిరేసి వెంకట్రావు పాల్గొన్నారు.

జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు

ఏలూరుసిటీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో జిల్లాలో అక్కడక్కడా వర్షాలు కొనసాగుతున్నాయి. మంగళవారం కూడా పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా వేలేరుపాడు మండలంలో 54.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 18 మిల్లీమీటర్లుగా నమోదైంది. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లాలో 1487 హెక్టార్లలో వరి పంట ముంపునకు గురైందని జిల్లా వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. జిల్లాలో భారీగా వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జేసీ కలెక్టర్ పి ధాత్రిరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. దాదాపు 1999 మంది రైతులకు చెందిన పంట పొలాలు భారీ వర్షాల వల్ల ముంపునకు గురయ్యాయని వ్యవసాయ శాఖాధికారులు పరిశీలనలో తేలింది.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఆటోడ్రైవర్లను ఆదుకోండి : సీఐటీయూ

కుక్కునూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఫ్రీ బస్సు పథకం వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు నెలకు రూ.10 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయి కిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కుక్కునూరులోని ప్రజా సంఘాల కార్యాలయంలో మాట్లాడారు. ఫ్రీబస్సు పథకం వలన స్వయం ఉపాధి రంగంగా జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఆటో యూనియన్ నాయకులు గోచారపు వెంకటేశ్వర్లు, దార కృష్ణ, శ్రీను, అశోక్, అజయ్, రాజు, నరేశ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని వినియోగించుకోండి

దెందులూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి):అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏలూరు జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ పి.శారద అన్నారు.మంగళవారం పెదవేగి మండలం మండూరు గ్రామంలోని అంగన్వాడీ కోడ్ నెంబర్ 118 కేంద్రాన్ని పీడీ శారద పరిశీలించారు. సూపర్‌వైజర్ పార్వతిని వివరాలడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ టీచర్ లలిత కుమారి ఉన్నారు.

● భీమడోలు: గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సమర్థవంతమైన సేవ లందించాలని ఆర్‌జేడీ సుజాతరాణి సూచించారు. భీమడోలు మండలంలోని కురేళ్లగూడెం, పూళ్ల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. సీడీపీవో రాజ శేఖర్, సూపర్‌వైజర్ నూర్జహాన్ పాల్గొన్నారు.

గిరిజనులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన

ఏలూరు రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం స్థానిక సంస్థలు, ప్రభుత్వ అధికారులు, గిరిజనులకు కేంద్ర ప్రభుత్వ పథకాలు, పాలన పట్ల మంగళవారం అవగాహన కల్పించడంతో పాటు సామర్థ్య పెంపు శిక్షణనిచ్చారు. రెండ్రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని పరిశీలకులు ఆదిత్య గోస్వైన్ పరిశీలించి పథకాల గురించి గిరిజనులకు వివరించారు.

ఎంఈవోగా సాయిబాబా బాధ్యతలు

ఉంగుటూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖాధికారిగా పి.సాయిబాబా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గొల్లగూడెం హైస్కూలు ప్రధానోపాధ్యాయులుగా ఆయన కొనసాగుతుండగా సీనియార్టీ మీద పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. మండల విద్యావనరుల కార్యాలయంలో మండల యూ.టి.ఎఫ్.నాయకులు ఆయనను అభినందించి సత్కరించారు. ఇప్పటి వరకు బాధ్యతలు స్వీకరించిన పరసా వెంకట్రావును సత్కరించారు. యూ.టి.ఎఫ్. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉనుముల రాంబాబు, డాకి జోగినాయుడు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

ఏలూరు రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక నరసింహారావుపేటలోని ది ఫొటో ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ భవన్లో మంగళవారం ప్రపంచ ఫొటో గ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మద్దాల శేఖర్ మాట్లాడుతూ ఫొటో గ్రాఫర్ల జీవితాలు ఫొటోలతో ముడిపడ్డాయన్నారు. తొలుత ఫొటో సృష్టికర్త లూయిస్ డాగురె చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్‌డి ప్రసాద్, కోశాధికారి ఉజ్వల్ కుమార్ పాల్గొన్నారు.

● టి.నర్సాపురం: టి.నర్సాపురం మండల సూపర్ సీనియర్స్ లూయిస్ డాగురే ఫొటో, విడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. సంఘ కార్యదర్శి కొలగాని ప్రసాద్, ఉపాధ్యక్షులు మహరాజు ఆధ్వర్యంలో లూయిస్ డాగురే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భార్గవ్, సత్యనారాయణ, సుధీర్, మహేశ్ పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ

భీమడోలు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): దోమల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. భీమడోలు శివారు అర్జావారిగూడెంలో పరిసరాల శుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నీటి నిల్వలు లేకుండా ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ నిల్వ ప్రాంతాల్లో దోమల నివారణ మందులను పిచికారీ చేయించారు. వైద్య సిబ్బంది రామకృష్ణ, శ్రీనివాసరావు, మురళి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సామూహిక మంగళ గౌరీ వ్రతాలు

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసంలోని ఆఖరి మంగళవారం, ఏకాదశి పర్వదినం కూడా కలిసి రావడంతో నగరంలోని అమ్మవారి ఆలయాల వద్ద మహిళలు సామూహికంగా మంగళ గౌరీవ్రతాలు నిర్వహించారు. అనంతరం పారాయణలు నిర్వహించారు.ఈ మేరకు సత్రంపాడులోని స్వయంభూ సౌభాగ్య లక్ష్మీదేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని ధనలక్ష్మీదేవిగా అలంకరించి ఆలయ అర్చకులు ఊటుకూరి నాగేశ్వరశర్మ దర్శనమిచ్చారు. అనంతరం ఆలయ యాజ్ఞిక బ్రహ్మ తమ్మిరాజు వికాస్ శర్మ మహిళలతో సామూహికంగా మంగళ గౌరీ వ్రతాలు జరిపించారు. ఆలయ చైర్మన్ కె.జి.ఎస్.వి. గోపాలకృష్ణ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చిన బాబు, శ్రీనివాసరావు, నాగభూషణం, ప్రవీణ్, పోతురాజు, సావిత్రమ్మల బృందం భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు. అలాగే అంబికాదేవి ఆలయంలో ఆలయ ప్రధానార్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో మహిళలు గౌరీ వ్రతాలను జరిపించారు. ఆలయ మేనేజర్ ఓగిరాల మల్లికార్జునరావు ఏర్పాట్లు చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకటేశ్

ద్వారకాతిరుమల, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి):కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయాన్ని, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ఎక్కువగా ప్రోత్సహిస్తోందని వ్యవసాయ శాఖ ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ వెంకటేశ్ అన్నారు. మండలంలోని గుండుగొలనుకుంటలోని బయో రిసోర్స్ సెంటర్ యూనిట్‌లో ఎన్టీఆర్, ఏలూరు, కృష్ణా, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల నుంచి వచ్చిన 50మంది బయో రిసోర్స్ కేంద్ర యజమానులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా క్షేత్ర సందర్శన చేశారు. ఇందులో ఏటీఎం అనే 20సెంట్ల నమూనాను చూపించగా ఏడాది పొడవునా వ్యవసాయం ద్వారా ఆదాయం పొందగలిగే విధానాలను, అంతర పంటలు, పిఎండిఎస్, 365 రోజుల గ్రీన్ కవర్(బయోమాస్ ద్వారా మట్టిని ఆరోగ్యంగా ఉంచడం) వంటి నమూనాలను ప్రదర్శించారు. మేనేజర్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ఈ ఏడాది 3.5లక్షల మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేలా కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో మరిన్ని బయోరిసోర్స్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ మేరకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. శిక్షణలో జీవ ఉత్పత్తులు నాణ్యత, బీఆర్సీ యూనిట్ల నిర్వహణ, ప్రకృతి వ్యవసాయం వల్ల నేల, మానవ ఆరోగ్యానికి కలిగే ప్రయోజనంపై శిక్షణ ఇచ్చారు.ఏలూరు ప్రకృతి వ్యవసాయ డీపీఎం ప్రవీణ్, బయోరీసోర్స్ సెంటర్ యజమానులు, ఎస్పీఎం యూ సభ్యులు పాల్గొన్నారు.



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న మానవత సభ్యులు

మానవత శాంతి ర్యాలీ

చింతలపూడి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో మానవత సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఫైర్‌స్టేషన్ సెంటర్ నుంచి శ్రీ విద్య డిగ్రీ కళాశాల వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. చైర్మన్ ఎ.అప్పారావు మాట్లాడుతూ మానవత ఆధ్వర్యంలో మరిన్ని సేవలందించే కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. అధ్యక్షులు యడ్లపల్లి శ్రీనివాసరావు, సభ్యులు ఎ.సత్యనారాయణ, పుల్లూరి సోమశేఖర్, కె.నాగ చిన్నారావు, జె.విశ్వేశ్వరరావు, అంజిబాబు పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిర్రి

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే చిర్రి

కొయ్యలగూడెం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. ఈ మేరకు ఆయన మండలంలోని బిల్లిమిల్లి, కనకాద్రిపురం, గ్రామాల్లో రూ.27లక్షలతో నిర్మిస్తున్న ప్రభుత్వ పాఠశాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం పరింపూడి పంచాయతీలో వివిధ సీసీ.రోడ్లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అన్ని గ్రామాల్లోనూ రహదారి నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ ముందుకు వెళ్తుందన్నారు. సర్పంచ్‌లు ముప్పిడి విజయకుమారి, శాంతకుమారి, టీడీపీ నాయకులు మేఘలాదేవి, పారేపల్లి నరేశ్, చింతల వెంకటరమణ పాల్గొన్నారు.



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరాలు పేదలకు మేలు

ఏలూరు రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో ఉపయోగకరమని మాజీ జడ్పీటీసీ గుత్తా కాశీబాబు అన్నారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రు ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఏలూరులోని రవికిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సొసైటీ బ్యాంకు ప్రెసిడెంట్ కలారి శ్రీనాథ్, నీటి సంఘం ప్రెసిడెంట్ ముల్పూరి వీరభద్రరావు,కె.శ్రీనివాస్, చాటపర్రు టీడీపీ గ్రామాధ్యక్షుడు పాతూరి నాని, కొల్లిపర శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అంబికా రాజాను కలిసిన ధర్మకర్తల మండలి సభ్యులు

సత్రం అభివృద్ధికి కృషి చేస్తా : రాజా

ఏలూరు రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): 80 ఏళ్ల తరువాత పవర్‌పేటలోని మద్దుల వారి సత్రానికి ధర్మకర్తల మండలిని నియమించడం పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు అంబికా రాజా హర్షం వ్యక్తం చేశారు. సత్రం ధర్మకర్తల మండలి చైర్మన్, ఎంవీఎస్ఎస్ సుబ్బారావు, సభ్యులు అంబికా రాజా మాట్లాడుతూ ధర్మకర్తలు సత్రం అభివృద్ధికి నిజాయితీగా పనిచేయాలని సూచించారు. సత్రం అభివృద్ధి కోసం విశేష కృషి చేసి ఆదర్శంగా నిలవాలన్నారు. మద్దులవారి సత్రం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

వరిచేలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

భీమడోలు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో నీటమునిగిన పంట పొలాలను డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు పరిశీలించారు. శాస్త్రవేత్తలు నాగేంద్ర, రమేశ్, వ్యవసాయ అధికారులు నీట మునిగిన వరి పంటను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ఏవో ఉషారాణి పాల్గొన్నారు.



రైతులకు సూచనలు చేస్తున్న అధికారులు

సాగుపై రైతులకు అవగాహన

దెందులూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ అవసరం మేరకే ఎరువులు వాడాలని దెందులూరు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎల్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గోపన్నపాలెంలో వ్యవసాయ విస్తరణ అధికారి వెంకట నాయుడు, ఉద్యానవన శాఖ అధికారి బి.కరణ్‌లతో కలిసి ఆయిల్ పామ్, నిమ్మ, అరటి తోటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.అనంతరం సీతంపేటలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు ఎరువుల వాడకం అంతర పంటలు పంట మార్పిడి వంటి వాటిపై అవగాహన కల్పించారు.

గీతాశ్రమానికి రక్షణ కావాలి

పోలవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టిసీమ శ్రీరామకృష్ణ గీతాశ్రమంపై విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు దాడి చేసి విధ్వంసం సృష్టించారంటూ ఆశ్రమ నిర్వాహకురాలు నందుల స్వరాజ్యలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ కొత్తపట్టిసీమ గ్రామానికి చెందిన విశ్వహిందూ పరిషత్ కార్యకర్త మొగల్తూరి పోశిబాబు ఆధ్వర్యంలో 30మంది విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు వచ్చి దాడి చేశారంటూ వాపోయారు. ఆశ్రమ ప్రాంగణంలో ఉన్న ఆశ్రమ నియమాల బోర్డుపై రంగులు పూసి, తన అనుమతి లేకుండా విశ్వహిందూ పరిషత్ ఫ్లెక్సీలను కట్టి దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆరోపించారు. వృద్ధురాలినని కూడా చూడకుండా పోశిబాబు తనను చంపుతానని బెదిరించాడంటూ స్వరాజ్యలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

పోలవరం, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ స్మారక వృద్ధాశ్రమంలో మంగళవారం పోలవరం ప్రాజెక్టు భద్రతా బలగాల సీఐ ఎ.విజయకుమార్ అన్నదానం నిర్వహించారు.ఆయన పుట్టిన రోజు సందర్భంగా భార్య సుధారాణి ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులకు సీఐ దంపతులు స్వయంగా భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు. ప్రాజెక్టు చెక్‌పోస్టు వద్ద ఈ సందర్భంగా సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

ఐసీడీఎస్ ఈవో మల్లికకు పదోన్నతి

ఏలూరు,ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో ఈవో(అంగన్‌వాడీ సూపర్‌వైజర్)గా పనిచేస్తున్న మల్లికకు సీడీపీవోగా పదోన్నతి లభించింది. ఈమెను అల్లూరిసీతారామరాజు జిల్లా కూనవవరం ప్రాజెక్టు సీడీపీవోగా బదిలీ అయ్యారు. కార్యాలయంలో పని విభజన, ఇతర అవగాహన కార్యక్రమాల నిర్వహణలో చురుగ్గా వ్యవహరించేవారని ఐసీడీఎస్ వర్గాలు చెబుతున్నాయి.

సైబర్ నేరాలపై అవగాహన

జీలుగుమిల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసిత కాలనీల్లో సైబర్ నేరాల పట్ల జీలుగుమిల్లి సీఐ బి.వెంకటేశ్వరరావు, ఎస్.ఐ. వి.క్రాంతికుమార్‌లు అవగాహన కల్పించారు. మంగళవారం సాయంత్రం స్వర్ణవారిగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వాసులతో పోలీస్ శాఖ అధికారులు కలిశారు. ప్రస్తుతం సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శక్తియాప్ వినియోగం, గంజా, మత్తు పదార్థాలకు బానిసలైతే కలిగే నష్టాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

భక్తుల శాంతి ర్యాలీ

కామవరపుకోట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కామిక ఏకాదశి పర్వదినం సందర్భంగా కామవరపుకోట మండలం కళ్లచెరువు గ్రామంలో శాంతి ప్రదర్శన చేపట్టారు. చెలికాని భాస్కరరావు మిత్ర బృందం, మహిళా ప్రతినిధులు సంయుక్తంగా మంగళవారం శ్రీవారి చిత్రపటంతో, జెండాలతో గ్రామంలో ఈ ప్రదర్శన నిర్వహించారు. భక్త బృందం భక్తి సంకీర్తనలు ఆలపిస్తూ భజనలు చేస్తూ శాంతిని కోరుతూ ప్రదర్శనలు చేయడం ప్రజలను ఆకట్టుకుంది.

పేకాట స్థావరంపై దాడి

ఉంగుటూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు శివారులో సోమవారం పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.22,900 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్.ఐ. ఎం.సూర్యభగవాన్ తెలిపారు.

అప్పనవీడులో అన్నదానం

పెదపాడు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అప్పనవీడులోని ప్రసిద్ధి చెందిన అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద దాతల సహకారంతో మంగళవారం అన్నదానం నిర్వహించారు. వైజాగ్‌కు చెందిన దాత వార రవీంద్ర ఆర్థిక సహకారంతో నిర్వహించిన అన్న కార్యక్రమంలో సుమారు 200 మంది అన్న ప్రసాదాలు స్వీకరించినట్టు ఆలయ చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించినట్టు ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు తెలిపారు.

బైపాస్ రోడ్డు పటిష్టతకు చర్యలు తీసుకోండి

కామవరపుకోట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఏలూరు-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారిలో ఆడమిల్లి గ్రామం వద్ద కుంగిన వంతెన స్థానంలో నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణ పటిష్టతకు చర్యలు తీసుకోవాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య కోరారు. ఈ బైపాస్ నిర్మాణానికి లక్షలాది రూపాయలు కేటాయించినప్పటికీ నిర్మాణంలో నాణ్యతలేదన్నారు. ఈ బైపాస్ రోడ్డు మరలా కొద్ది రోజుల్లోనే కుంగిపోయే ప్రమాదం ఉందని, అలాంటి పరిస్థితులు ఏర్పడకుండా ముందస్తుగానే తగిన భారీ రాళ్లతో రోడ్డు నిర్మించి రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు నాణ్యతగా రోడ్లు నిర్మించాలని ఆయన స్పష్టం చేశారు.

పెన్షన్ల రద్దు నోటీసులపై అప్పీలుకు అవకాశం

ముదినేపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రీ వెరిఫికేషన్‌లో అనర్హులుగా నిర్ధారించి ఎన్టీఆర్ భరోసా పింఛను రద్దయిన దివ్యాంగ పెన్షనర్లు తాము అర్హులమని భావిస్తే తిరిగి అప్పీల్ చేసుకోవచ్చునని ముదినేపల్లి ఎంపీడీవో వై.రామకృష్ణ తెలిపారు. పెన్షన్‌దారులు తమ అప్పీలు అర్జీలను మండల పరిషత్ కార్యాలయంలో అందజేస్తే అధికారులు వాటిని పెన్షన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి తదుపరి చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఆ అర్జీలను పరిశీలించి తిరిగి వైకల్య పరిశీలనకు అర్జీదార్లకు నోటీసులిస్తామని తెలిపారు.

సి. గుడిపాడులో ఫాగింగ్

చాట్రాయి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసింహారావుపాలెం శివారు సి.గుడిపాడులో మంగళవారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్, సర్పంచ్ ప్రశాంతి ఆధ్వర్యంలో దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు. ఈ గ్రామంలో ఇటీవల జ్వరంతో కఠారు విజయ్(25) అనే యువకుడు చనిపోవటంతో జ్వరాల నివారణ చర్యలలో భాగంగా ఫాగింగ్ చేశారు. జ్వర లక్షణాలు కన్పిస్తే వెంటనే పీహెచ్‌సీకి వచ్చి వైద్యం చేయించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నిండు కుండలా తమ్మిలేరు ప్రాజెక్టు



చాట్రాయి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బంగాళా ఖాతంలో వాయుగుండం ప్రభావంతో ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు తమ్మిలేరు ప్రాజెక్టు నిండు కుండలా మారింది. మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 324 కూసెక్కులు ఉండగా, నీటిమట్టం 340.4 అడుగులకు చేరినట్లు, జలాశయం నీటి నీటినిల్వ సామర్థ్యం 355 అడుగులు అని ప్రాజెక్టు ఏఈ లాజరుబాబు తెలిపారు. ప్రాజెక్టు ఎగువ తెలంగాణలో ఉన్న బేతుపల్లి జలాశయం, తుంబూరు ఆనకట్ట అలుగుపడితే వరద పోటెత్తే అవకాశం ఉన్నదని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రాజెక్టు కింద ఏలూరు జిల్లాలో 25 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా ఖరీఫ్, రబీ పంటలకు నీటి కొరత ఉండదని ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, రైతులు ప్రాజెక్టు వద్దకు వచ్చి నీటిని తిలకిస్తున్నారు.

చెత్త సేకరణను తనిఖీ చేసిన జడ్పీ సీఈవో



కార్యదర్శికి సూచనలిస్తున్న జడ్పీ సీఈవో శ్రీహరి

ముసునూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సంపద కేంద్రాలను సమర్థ వంతగా నిర్వహించి, పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చాలని జడ్పీ సీఈవో శ్రీహరి అన్నారు. వేల్పు చర్లలో చెత్తసేకరణను మంగళ వారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం సంపద కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడుతూ చెత్త సేకరణ, సంపద కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. కార్యదర్శి శ్రీనివాస చౌదరి, పారుశుధ్య సిబ్బందికి సీఈవో పలు సూచనలు ఇచ్చారు. ఎంపీడీవో బీపీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉండాలి

కలిదిండి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వర్షాల దృష్ట్యా ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల మత్స్యశాఖ అధికారి రవికుమార్ అన్నారు. మంగళవారం పడమటి పాలెం, ఎస్సార్పీ అగ్రహారం గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించి మాట్లాడుతూ వర్షాలకు చెరువులో నీరు చల్లబడి ఆక్సిజన్ లోపించి చేపలు, రొయ్యలు మృత్యువాత పడే ప్రమాదం ఉందని, ఏరియేటర్లు నిరంతరాయంగా తిరుగుతూ ఉండాలన్నారు. మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ సార్వా పంటకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, ప్రస్తుతం 15 టన్నులు అందుబాటులో ఉందన్నారు.



చెక్కపల్లి త్రిసభ్య కమిటీకి సత్కారం

ముసునూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఉత్తమ సేవలను అందించి, సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు అన్నారు. మంగళవారం చెక్కపల్లి సొసైటీ నూతన త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. అధ్యక్షుడిగా కాటేపల్లి ప్రసాద్, డైరెక్టర్లుగా వేంపాటి శ్రీనివాసరావు, దారం నాగమణితో కార్యదర్శి దుర్గారావు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం రఘుబాబు, మాజీ జడ్పీటీసీలు చిలుకూరి వెంకటేశ్వరరావు, కందుల పిచ్చియ్య, సొసైటీ మాజీ అధ్యక్షుడు కాటేపల్లి లింగారావు, నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కొండేటి బాబి, బీసీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి యోహాను, వేంపాడు మేజర్ చైర్మన్ రాపర్ల బాలకృష్ణ, నాయకులు తల్లిబోయిన సత్యనారాయణ, కాటేపల్లి శ్రీనివాస రావు, జనసేన నాయకులు నాగబాబు, శివరామకృష్ణ తదితరులు కమిటీని సత్కరించారు.

25న విజయవాడలో మహాధర్నా

నూజివీడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ ఈ నెల 25న విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు డీఎస్సీ 2003 ఉపాధ్యాయుల ఫోరం తెలిపింది. ఈ మేరకు నూజివీడు ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ హైస్కూల్లో మంగళవారం పలు ఉద్యోగ సంఘాల నాయకులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో తమకు పాత పద్ధతిలోనే పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. విజయవాడలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని ఉద్యోగ సంఘాలకు పిలుపునిచ్చారు. ఫోరం జిల్లా కన్వీనర్ బి. శ్రీనివాసరావు, యూటీఎఫ్ నాయకులు జి. వెంకటేశ్వరరావు, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం

కలిదిండి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో మట్టగుంట న్యూ డ్రెయిన్ పనులను డీసీ వైస్ చైర్మన్‌గా నాగిడి వీరబ్రహ్మం, నీటి సంఘం అధ్యక్షుడు మంతెన సుబ్బరాజు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రెయిన్ తూడు డెక్క, కిక్కిసతో పూడిపోవటంతో మురుగునీటి పారుదల నిలిచి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు ఇబ్బందులు పడుతుండటంతో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చొరవతో ఎక్స్‌కవేటర్‌తో పూడికతీత పనులు ప్రారంభించామన్నారు. సుమారు 5 కిలోమీటర్ల మేర డ్రెయిన్‌లో దట్టంగా పేరుకుపోయిన కిక్కిస, డెక్క, తూడును తొలగిస్తామని, రైతులు సహకరించాలని కోరారు. మాజీ ఎంపీపీ బండి తులసీరావు, రైతులు అక్కల వెంకటాచలం, తిరుమాని నాగరాజు, మంతెన రాము పాల్గొన్నారు.

మద్యం పాలసీకి వ్యతిరేకం : ఐద్వా

నూజివీడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పలు అనర్థాలకు కారణమైన మద్యంకు తాము వ్యతిరేకమని, మద్యం పాలసీని ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఐద్వా నూజివీడు శాఖ కార్యదర్శి నండూరి పద్మాంజలి పేర్కొన్నారు. మంగళవారం నూజివీడులో విలేకరులతో మాట్లాడుతూ బార్ల నిర్వహణ సమయం కూడా పెంచడం ద్వారా ప్రభుత్వమే తాగుబోతులను మరింత ప్రోత్సహిస్తూ వారి సంఖ్యను పెంచడం ద్వారా ప్రభుత్వమే తాగుబోతులను మరింత ప్రోత్సహిస్తూ వారి సంఖ్యను పెంచుతోంది అన్నారు. నేడు సమాజంలో తాగుబోతు భర్తలను భరించలేక పెద్ద సంఖ్యలో భార్యలు విడాకులు కోరుతూ కోర్టులకు ఎక్కే వారి సంఖ్య నానాటికి పెరుగుతూ ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. రాష్ట్రంలో ఆరోగ్యకరమైన సమాజం ఉండాలంటే ప్రభుత్వం ఈ మద్యాన్ని పరిమితం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

పద్మజ మృతి పట్ల ఎన్టీఆర్ ఫ్యాన్స్ సంతాపం

ముదినేపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ కుమారుడు జయకృష్ణ సతీమణి పద్మజ మృతి పట్ల అఖిల భారత ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఉపాధ్యక్షుడు వడ్డెల్లి సాంబశివరావు, కైకలూరు నియోజకవర్గ ఫ్యాన్స్ అధ్యక్షుడు బత్తుల నాగ వెంకట దుర్గా ప్రసాద్ సంతాపం తెలిపారు. పద్మజ ఎన్టీఆర్ కోడలిగా నందమూరి కుటుంబ ఔన్నత్యాన్ని కాపాడారని వారు పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

అధికారుల పాపం.. అన్నదాతకు శాపం

▸డ్రెయిన్లు పూడుకుపోయి కదలని నీరు ▸ ముంపులోనే పొలాలు



ముదినేపల్లి మండలం పెదపాలపర్రు వద్ద రోడ్డు విస్తరణలో పూడిపోయిన డ్రెయిన్ (ఇన్‌సెట్) కుళ్లిన వరి పైరు చూపిస్తున్న రైతు వెంకటరమణ



ముదినేపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుపై సైడ్ డ్రెయిన్లు పూడుకుపోవటంతో ముదినేపల్లి మండలం పెదపాలపర్రు, గుడివాడ రూరల్ మండలం చౌటపల్లి గ్రామాల పరిధిలోని ఆయకట్టు భూములు వర్షాలకు ముంపునకు గురయ్యాయి. పది రోజుల క్రితం కురిసిన వర్షాలకు పొలాల్లో ఏర్పడిన ముంపు నేటికీ తగ్గకపోవటంతో సార్వా వరి పైరు నీటమునిగి కుళ్లిపోయింది. ఎంతో కాలంగా పెదపాలపర్రు ఏరియాలోని రోడ్డు సైడ్ డ్రెయిన్‌కు రిటైనింగ్ వాల్ నిర్మించి పూడిక తీయించాలని కోరినా ఫలితం లేకపోవటంతో సుమారు 1200 ఎకరాల ఆయకట్టులో ఏర్పడిన ముంపు వల్ల వరి పైరుకు తీవ్ర నష్టం కలిగిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారుల విస్తరణ పనులతో డ్రెయిన్ పూడిపోతే డ్రెయినేజీ శాఖ అధికారులు చూస్తూ ఊరుకుంటున్నారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోవటంలేదని పెదపాలపర్రు రైతులు విమర్శిస్తున్నారు. ఈ సందర్భంగా పెదపాలపర్రు రైతు చల్లగుళ్ల వెంకటరమణ మాట్లాడుతూ రోడ్ సైడ్ డ్రెయిన్ జాతీయ రహదారి విస్తరణ పనుల వల్ల పూడిపోయింది. డ్రెయిన్‌కు రిటైనింగ్ వాల్ నిర్మించి పూడికను తొలగించాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవటం లేదు. ఇప్పటికే ఎకరాకు రూ.15 వేల నుంచి 20 వేలు పెట్టుబడి పెట్టాం. వరి పైరు కుళ్లిపోయింది. అధికారులు పరిశీలించి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, డ్రెయిన్ పూడిక తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

అధికారుల పనితీరుపై సబ్ కలెక్టర్ ఆగ్రహం



అర్జీదారుడి సమస్యలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ వినూత్న

ముసునూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ, అధికారుల పనితీరుపై నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల స్థాయి అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో రికార్డుల గదులు, టాయిలెట్లు పరిశీలించి మండిపడ్డారు. వెంటనే శుభ్రం చేయించాలని ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్ ప్రశాంతిని ఆదేశించారు. రికార్డులను భద్రపరిచే గదులు స్టోర్‌రూమ్‌లా ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు. సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధికారులు సమయపాలన పాటించి, ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలన్నారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, గృహ నిర్మాణం, ఐసీడీఎస్, పోలీస్, ఆరోగ్య శాఖల పనితీరుపై సబ్ కలెక్టర్ సమీక్షించారు. ప్రభుత్వ లక్ష్యాలను నేరవేర్చేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని ఆమె సూచించారు.

ఇళ్ళ స్థలాల అర్జీలపై విచారణ...

ప్రభుత్వ పోరంబోకు భూముల్లో ఏళ్ళ తరబడి నివాసం ఉంటున్న వారికి పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన జీవో నంబరు 30పై వచ్చిన అర్జీలపై సబ్ కలెక్టర్ విచారణ చేశారు. ఏళ్ళ తరబడి నీరు, విద్యుత్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తమకు ఇళ్ళ పట్టాలను ఇప్పించి, సౌకర్యాల కల్పించాలని అర్జీదారులు సబ్ కలెక్టర్‌ను కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉన్నవారికి మాత్రమే ఇళ్ళ పట్టాలు ఇస్తామని ఆమె తెలిపారు. ఎంఈవో సుబ్బారావు, పీఆర్ ఏఈ దుర్గాప్రసాద్, ఏఎస్ఐ బేగ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈ దివాకర్, వీఆర్వోలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



కైకలూరులో దాగురే విగ్రహం వద్ద నివాళి



చాట్రాయిలో నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు



కలిదిండిలో సీనియర్ ఫొటోగ్రాఫర్లకు సత్కారం

చిత్రం.. భళారే విచిత్రం

ఘనంగా ఫొటోగ్రఫీ డే.. డాగూరేకు నివాళి

చాట్రాయి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కోటి అక్షరాలు చెప్పలేని భావాన్ని ఓ చిత్రంలో చూపేదే ఫొటో అని, వర్తమానం నుంచి గత జ్ఞాపకాల లోకానికి తీసుకు వెళ్ళే ఫొటో మన జీవిత మధుర క్షణాలను శాశ్వతంగా నిలుపుతుందని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం ఫొటోగ్రఫీ డే సందర్భంగా చాట్రాయిలో ఫొటోగ్రాఫర్లు ర్యాలీ నిర్వహించి, ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల ఫొటోగ్రాఫర్ల సంఘం వద్ద ఉన్న రూ. లక్ష నిధులను, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి ఉపయోగించాలని తీర్మానించారు. ప్రభుత్వం ఫొటోగ్రాఫర్లకు సబ్సిడీ రుణాలు అందించాలని కోరారు. సీనియర్ ఫొటోగ్రాఫర్లను సన్మానించారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు సవరం రామారావు, రెబ్బ సుమన్, ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

కైకలూరు: నేటి పోటీ ప్రపంచంలో సోషల్ మీడియా, స్మార్ట్ ఫోన్ల వల్ల ఫొటోగ్రఫీ దెబ్బతింటోందని ఫొటోగ్రాఫర్లు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని రాణించాలని సంఘ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం కైకలూరులో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కైకలూరు నియోజకవర్గ ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ నేటి సమాజంలో రాణించాలంటే వెడ్డింగ్ ఫొటోగ్రఫీ, పర్సనలైజ్డ్ ఫొటో ప్రొడక్ట్స్, డ్రోన్ ఫొటోగ్రఫీ, ఏఐ టూల్స్, ఆన్‌లైన్ కోర్సుల ద్వారా నైపుణ్యం సాధించి పోటీతత్వాన్ని తట్టుకుని వృత్తిలో రాణించాలన్నారు. ఈ సందర్భంగా సీనియర్ ఫొటోగ్రాఫర్‌లు పండ్రెడ్డి నటరాజ్, నెంద్రు జాషువా, సాగర్‌లను సత్కరించారు. టీడీపీ నాయకులు కెకె బాబు, వీరాబత్తిన సుధా, ఎండీ ఉస్మాన్, రసూల్ ఖాన్‌తో పాటు ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసు, గౌరవ అధ్యక్షుడు కె శ్యాంసువర్ణరావు (సుమంత్), కార్యదర్శి సుకుమార్, సంఘ సభ్యులు సతీష్‌కన్నా, సుమంత్ బాలాజీ, రామకృష్ణ, సురేష్, మోషే తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: కలిదిండిలో మంగళవారం మండల ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షుడు నాగ ప్రసాద్ మాట్లాడుతూ ఫొటోగ్రఫీని జీవనోపాధిగా చేసుకుని వేల కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. టెక్నాలజీకి అనుగుణంగా ఫొటోగ్రాఫర్లు రాణించాలన్నారు. అనంతరం సీనియర్ ఫొటోగ్రాఫర్లు విక్టర్, జోసెఫ్‌ను ఘనంగా సత్కరించారు. ఫొటోగ్రాఫర్లు ఎస్.శ్రీనివాసరావు, త్రినాథ్, అయన్న, ఇమ్మానియేలు, సాయితేజ, డి.రాజు, దుర్గారావు, నరేంద్ర, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



పెచ్చులూడిన ఎంఈవో కార్యాలయం

మండవల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండవల్లి ఎంఈఓ కార్యాలయ భవనం నుంచి పెచ్చులూడి పడడంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికే భవనం స్లాబ్ కుంగిపోయి దారుణంగా తయారైంది. దీంతో నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు మంగళవారం ఉదయం పెద్ద శబ్దాలతో భారీ పెచ్చులు ఊడిపడ్డాయి. ప్రమాద సమయంలో సిబ్బంది ఎవరు లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. నూతన భవనం నిర్మించాలని సిబ్బంది వేడుకుంటున్నారు.

చైతన్య విద్యార్థికి అవార్డు

ముసునూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెక్కపల్లి చైతన్య విద్యార్థి లీలాకృష్ణనందుకు ప్రభుత్వ షైనింగ్ స్టార్ అవార్డు వరించింది. ఏలూరులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చేతులు మీదుగా విద్యార్థి రూ. 20వేలు ప్రోత్సాహక నగదు, ప్రతిభ సర్టిఫికెట్‌ను అందుకున్నాడు. ప్రిన్సిపాల్ మరీదు నాగరాజు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు విద్యార్థిని అభినందించారు.

కాల్వలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు.. తప్పిన ముప్పు

ఆగిరిపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లిలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ బస్సు మంగళవారం గన్నవరం మండలం, గొల్లనపల్లి గ్రామం నుంచి 10 మంది విద్యార్థులతో ఆగిరిపల్లి వస్తుండగా తోటపల్లి శివారు ప్రాంతంలో బస్సు అదుపు తప్పి సైడ్ కాలువలోకి దూసుకెళ్ళింది. ఈ ఘటనలో విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం తెలుసుకున్న ఆగిరిపల్లి ఎస్ఐ కె శుభశేఖర్ ఘటనా స్థలానికి చేరుకొని జరిగిన ప్రమాదాన్ని పరిశీలించి, స్కూల్ బస్ డ్రైవర్‌కు పలు సూచనలు తెలియజేశారు.

వివాహిత ఆత్మహత్య

కలిదిండి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పురుగు మందు తాగి వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలికి చెందిన ముత్యాల హేమ (28)కి కలిదిండి మండలం సంతోషపురం గ్రామానికి చెందిన చిట్టిబాబుతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. భర్త మద్యానికి బానిసై కుటుంబ పోషణ పట్టించుకోకుండా ఆమెను శారీరకంగా, మానసికంగా హింసిస్తుండటంతో మనస్థాపానికి గురై ఈ నెల 8న గడ్డి మందు తాగింది. ఆమెను కలిదిండి, భీమవరం ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి వైద్యం చేయించారు. అప్పటి నుంచి ఆమెకు తరచూ కడుపు నొప్పి వస్తోంది. సోమవారం తీవ్రంగా కడుపునొప్పి రావటంతో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు: డీఎస్పీ

నూజివీడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ భవిష్యత్‌పై దృష్టి పెట్టాలని నూజివీడు డీఎస్పీ కేవీవీ ప్రసాద్ అన్నారు. నూజివీడు మండలం అన్నవరంలోని నూజివీడు పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం విద్యార్థులతో మాట్లాడారు. మాదక ద్రవ్యాల వాడితే జరిగే దుష్పరిణామాలు, కేసులు, ర్యాగింగ్ వల్ల జరిగే నష్టాలు, సోషల్ మీడియా వల్ల జరిగే అనర్థాలపై విద్యార్థులకు వివరించారు. సరదాగా చేసే ర్యాగింగ్ వలన కొన్ని సార్లు ప్రాణాలు పోయిన సందర్భాలు ఉన్నాయన్నారు. ఈ కేసుల్లో విధించే శిక్షలపై వివరించారు. విద్యార్థులు పోలీస్ కేసుల్లో ఉంటే భవిష్యత్ దెబ్బతింటుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో జరిగే మోసాలు, బ్యాంక్ కార్డులు వినియోగంపై విద్యార్థులకు తెలిపారు. సైబర్ కేసుల పట్ల ప్రమాదంగా ఉండాలన్నారు. నూజివీడు రూరల్ సీఐ కె. రామకృష్ణ, రూరల్ ఎస్ఐ జ్యోతిబసు, కళాశాల ప్రిన్సిపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

23 నుంచి శ్రీశ్యామలాంబ మాలధారణ దీక్షలు

కైకలూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కైకలూరు శ్రీశ్యామలాంబ మాలాధారణ దీక్షలు ఈ నెల 23 నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ ఈవో శేఖర్ తెలిపారు. మండల దీక్ష ఈ నెల 23 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు, అర్ధమండలి దీక్ష వచ్చే నెల 12 నుంచి అక్టోబరు 2 వరకు, నవదీక్ష సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన భక్తులు అమ్మవారి ఆలయ కార్యాలయంలో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. నూతనంగా మాలాధారణ స్వీకరించే భక్తులకు అమ్మవారి రాగి ప్రతిమను ఉచితంగా అందజేస్తామన్నారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవం

ముసునూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): చెక్కపల్లి దివాణం సెంటర్‌లోని రామాలయం ద్వితీయ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు చేసి విశేషంగా అలంకరించారు. అనంతరం 9 మంది దంపతులు పీటలపై కూర్చొని స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది. సాయంత్రం మేళతాళాలతో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు.

నీళ్లతో మద్యం కల్తీ



కల్తీకి ఉపయోగించిన మద్యం బాటిళ్లు 99, ఓఏబీ బ్రాండ్లు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకు దొరికే మద్యాన్ని తాగే పేద, మధ్య తరగతికి చెందిన మందు బాబులను మోసం చేస్తూ నీళ్లు కలిపిన మద్యం, బ్రాండ్ మార్చిన మద్యాన్ని ఒరిజినల్ మద్యం మాదిరిగా బెల్ట్ షాపుల వద్ద అమ్ముతున్న ఇద్దరు అన్నదమ్ములను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ స్టేషన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంటెంట్ సీహెచ్. అజయ్‌కుమార్ సింగ్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బోయపాటి శ్రీలత, అసిస్టెంట్ కమిషనర్ కేవీఎస్. ప్రభుకుమార్ ఆదేశాలతో దాడులు నిర్వహించినట్టు తెలిపారు. కల్తీ చేసిన మద్యాన్ని ద్విచక్ర వాహనంపై తరలిస్తున్నారని వచ్చిన సమాచారంతో జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెం గ్రామం సమీపంలో మంగళవారం ఉదయం దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడిలో మండలంలోని వేగవరం గ్రామానికి చెందిన నూతి మధు ద్విచక్ర వాహనంపై మద్యం తరలిస్తూ ఉండగా అరెస్టు చేశామన్నారు. అతడిని విచారించిన అనంతరం వేగవరంలోని అతడి ఇంటివద్ద దాడులు నిర్వహించామన్నారు. అక్కడ అతడి తమ్ముడు నూతి సాయిరాంతో పాటు మద్యం సీసాలు, మద్యం కల్తీ చేయడానికి ఉపయోగించే ఖాళీ సీసాలు, మూతలు, తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు.

రెండు రకాల మద్యం బాటిళ్ల ధరలు ఇలా..

మద్యం దుకాణాలు లేని గ్రామాల్లో బెల్ట్ షాపుల వద్ద రూ.99 ధర ఉన్న '99' బ్రాండ్ మద్యాన్ని నూట ఇరవై రూపాయలకు, ఇదే 99 బ్రాండ్ మద్యంతో ఓఏబీ క్వార్టర్ బాటిళ్లలో నింపిన బాటిళ్లను రూ.150కు అమ్ముతున్నారు. మద్యం దుకాణాల్లో ఓఏబీ క్వార్టర్ ధర రూ.130. ఈ రెండు బ్రాండ్ లు రాడికో కంపెనీ తయారు చేసినవే కావ డంతో పెద్దగా తేడా తెలియవని నిందితులు ఈ బ్రాండ్‌లు ఎంచుకున్నట్టు తెలిపారు. వీరిద్దరితో పాటు రాడికో కంపెనీ లేబిల్స్ బాటిల్ మూతలపై ముద్రించి అక్రమానికి పాల్పడిన విజయవాడ ఎన్‌టెక్స్ చెందిన ముత్తా మనోజ్‌కుమార్ అనే గుజరాత్‌కు చెందిన వ్యాపారిపై కేసులు నమోదు చేశామని తెలిపారు.

● నిందితులైన మధు, సాయిరాం తండ్రి రామకృష్ణపై గతంలో నాటు సారా కేసులు న్నాయని తెలిపారు. మూతలు సప్లై చేసిన వ్యాపారి ముత్తా మనోజ్‌కుమార్‌పై కూడా గతంలో నరసాపురంలో నకిలీ మూతల సరఫరా చేసినందుకు కేసులున్నట్టు తెలిపారు. ఈ దాడిలో నిందితుల నుంచి 219 మద్యం సీసాలు, 19,500 ఓఏబీ బ్రాండ్‌తో ఉన్న బాటిల్ మూతలు, 622 ఖాళీ ఓఏబీ క్వార్టర్ బాటిల్స్, 370 తీసివేసిన బాటిల్ మూతలు, ఒక స్కూటీ వాహనం, బాటిళ్లకు సీల్ వేసే బొంత సూది స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో స్థానిక ఎక్సైజ్ స్టేషన్ సీఐ కె.శ్రీనుబాబు, ఎన్‌ఫోర్స్ మెంట్ సీఐ వైవీఎస్ఎస్. ఫణికుమార్, స్టేషన్ ఎస్ఐ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాండ్ మార్చి ఇతర బ్రాండీ సీసాల్లో నింపి బెల్ట్ షాపులకు అమ్ముతున్న అన్నదమ్ముల అరెస్ట్

మార్పుకే..మచ్చ!

(5వ పేజీ తరువాయి)

ప్రతి సోమవారం రైతులు, సాధారణ పౌరులు తమ సమస్యలను ఏకరువు పెడుతూనే ఉన్నారు. కాని ఫలితం మాత్రం లేదు. ఎమ్మెల్యేలు కలుగ చేసుకుని ప్రస్తావించాల్సి వస్తోంది. ఎరువులు, పురుగుల మందుల జారీకి వచ్చే ఆటంకాలను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌లాంటివారు లేవనెత్తాల్సిన పరిస్థితి వచ్చింది. జిల్లాలో ఎమ్మెల్యేలు, ఎంపీలు అందరూ అధికార పక్షానికి చెందినవారే. కీలక సమావేశాల్లో యంత్రాంగం వైఫల్యం మీద లేదా చేతకానితనం మీద మాట్లాడితే అది ప్రభుత్వ ప్రతిష్టకు మచ్చ. అందుకనే ఉన్న సమస్యపై బహిరంగంగా మాట్లాడలేక.. సక్రమంగా స్పందించని అధికారులపై విరుచుకుపడలేక ఎమ్మెల్యేలంతా నిస్సహాయతలో పడ్డారు. కాని అధికారంలో ఉండి తామేమీ చేయలేకపోతున్నామన్న భావన ప్రజల్లో ముదిరితే అది తమ చేతకానితనం అవుతుందేమోనని కొందరు ఎమ్మెల్యేలు ఆందోళనలో ఉన్నారు. ప్రత్యేకించి ప్రభుత్వపరంగా కొన్నింటిని ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యేలు సిద్ధమైనా అధికారులు తదనుగుణంగా స్పందించని ఘటనలు చాలానే ఉన్నాయి. శాఖల వారీగా సమీక్షలు జరుగుతున్నప్పుడు కేవలం అంకెల ప్రస్తావనతో సరిపెట్టకుండా పనితీరు ప్రామాణికంగా సమీక్షిస్తే తప్ప కొన్ని శాఖలు బాగుపడే పరిస్థితిలేదని భావిస్తున్నారు. ఇన్‌చార్జిమంత్రి మనోహర్ సైతం ఎమ్మెల్యేలు లేవనెత్తుతున్న సమస్యలను ప్రస్తావిస్తూ.. మనం ప్రత్యేకంగా భేటీ అయ్యి మాట్లాడుకుందామని నచ్చచెప్పాల్సి వస్తుంది.